


భారీ వినాయకుని నిమజ్జన దృశ్యం

మహా అధ్వానం

నగరంలో సమస్యలపై డీఆర్‌సీలో ఎమ్మెల్యేల ఆగ్రహం

- వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణపై తీవ్ర అసంతృప్తి
- పలు ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదని ఫిర్యాదు
- రిజర్వాయర్లలో పూడిక తీయించాల్సిందిగా కోరిన గణబాబు, వెలగపూడి
- వేపగుంట-పినగాడి రోడ్డు సమస్యను ప్రస్తావించిన పంచకర్ల
- మందకొడిగా ఆక్రమణల క్రమబద్ధీకరణ
- టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు డీసీసీబీ ద్వారా రుణాలు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి


కలెక్టరేట్‌లో శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధ్యక్షతన సమావేశమైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరాలో లోపాలపై పలువురు ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, అలాగే కొన్ని ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో చీకటి రాజ్యమేలుతుందని, కొండవాలు ప్రాంతాల్లో నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే విషయం పదేపదే చెబుతున్నా జీవీఎంసీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధ్యక్షతన సుమారు ఐదుగంటలపాటు జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. అజెండాలో పేర్కొన్న అంశాలకు తొలుత కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వివరించారు. అనంతరం మొదటి అంశం జీవీఎంసీపై చర్చ ప్రారంభమైంది. నగర పాలక సంస్థలో కొందరు ఉద్యోగులు వైసీపీ పాలనలో ఉన్నట్టు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ జోన్-4లో 10 మంది పారిశుధ్య కార్మికుల పేర్లు చెప్పి, వారు పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. మంత్రి జోక్యం చేసుకుని అరగంటలో వారు ఎక్కడ పనిచేస్తున్నారో ఫొటోలు తీసి సమావేశానికి పంపాలని ఆదేశించారు. దీంతో జోన్-4 కమిషనర్‌ను సమావేశానికి పిలిపించి 10 మంది కార్మికుల ఫొటోలు పంపాలని చెప్పారు. అయితే గంటన్నర సమయం దాటినా వారు పనిచేసే ఫొటోలు తీసుకురాలేకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దశలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్, అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేయాలని కోరగా మంత్రి అంగీకరించారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ నగరంలో చాలాచోట్ల మురుగు కాల్వలు ఆక్రమణలకు గురవ్వడంతోపాటు వాటిలో చెత్త వేయడంతో నీరు పారక పారిశుధ్య సమస్య ... మిగతా 6వ పేజీలో

నవంబరుకల్లా అనకాపల్లికి పోలవరం నీరు




- వచ్చే ఏడాది ఉత్తరాంధ్రలో మిగిలిన ప్రాంతాలకు తీసుకువెళ్లేలా ప్రణాళికలు
- నగర అవసరాల మేరకు నీటి నిల్వ సామర్థ్యం పెంపు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా నీటిని ఈ నవంబరు నాటికి అనకాపల్లి వరకూ తీసుకువస్తామని విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ప్రకటించారు. వచ్చే ఏడాదికల్లా పోలవరం నీటిని ఉత్తరాంధ్రలో మిగిలిన ప్రాంతాలకు తీసుకువెళ్లేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని అన్నారు. శనివారం ... మిగతా 6వ పేజీలో

బై..బై..గణేశా

ఘనంగా వినాయక నిమజ్జనాలు



విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రులు ముగియడంతో నగరంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భక్తులు శనివారం రాత్రి బీచ్‌కు తరలివచ్చారు. కొందరు శుక్రవారమే నిమజ్జనం చేయగా, మిగిలిన వారు శనివారం అనుపు కార్యక్రమం పెట్టుకున్నారు. ఐదు అడుగులు, అంత కంటే తక్కువ ఎత్తున్న విగ్రహాలను కోస్టల్ బ్యాటరీ వద్ద, అంతకంటే పెద్ద విగ్రహాలను జోడుగుళ్లపాలెం వద్ద సముద్రంలో ... మిగతా 6వ పేజీలో




గ్రీన్ రైల్వేస్టేషన్

- విశాఖ రైల్వే స్టేషన్‌కు గ్లోబల్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ గుర్తింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే స్టేషన్‌కు 'గ్రీన్ రైల్వే స్టేషన్' గుర్తింపు లభించింది. ఈ మేరకు గ్లోబల్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ శనివారం ధ్రువపత్రాన్ని జారీ చేసింది. ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన గ్రీన్ రైల్వే స్టేషన్ గుర్తింపు లభించడం సంతోషకరమన్నారు. ప్రతికూల పర్యావరణ ప్రభావాన్ని నియంత్రించడానికి అనుకూల పద్ధతులు, స్థిరమైన ప్రమాణాలు అవలంబించడంతో ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. స్టేషన్‌లో పారిశుధ్య నిర్వహణ, తగిన ప్రమాణాలు పాటించడంలో అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. స్టేషన్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పడంలో డివిజన్ పర్యావరణ, హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్ విభాగంతోపాటు అన్ని విభాగాలు కృషి ఉందన్నారు.

చేతులు మారిన కాలనీ ఇళ్లు

- అగనంపూడి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో 298 ఇళ్లు అమ్మకం
- 494 మంది గృహ ప్రవేశాలే చేయలేదు
- రౌడీమూకల ఆక్రమణలో మరికొన్ని ఇళ్లు...
- 1,709 ఇళ్లకు తాళాలు
- సర్వేలో బహిర్గతం


అగనంపూడి కాలనీలో హౌసింగ్ కాలనీ

విశాఖపట్నం/కూర్మన్నపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అగనంపూడి సమీపాన సుమారు పుష్కరకాలం కిందట నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కొన్ని ఇళ్లు చేతులు మారిపోయాయి. మరికొన్ని ఇంకా ఖాళీగానే ఉన్నాయి. ఇంకొన్ని ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. కాలనీలో 298 మంది లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్లను ఇతరులకు విక్రయించేశారు. మరో 494 మంది ఇప్పటివరకూ తమ కేటాయించిన ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయలేదు. ఇళ్ల కేటాయింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలతోపాటు, కొందరు రౌడీమూకలు ఇళ్లను ఆక్రమించుకుని ఇతరులకు విక్రయించారనే వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేయాలని కలెక్టర్‌కు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నాలుగు నెలల క్రితం లేఖ రాశారు. ఈ లేఖ ఆధారంగా కాలనీలో ఇళ్ల లబ్ధిదారులపై సమగ్ర విచారణకు కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. రెవెన్యూ, జీవీఎంసీ యూసీడీ, హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన అధికారులు, సిబ్బందితో 11 బృందాలను నియమించారు. ఆ బృందాలు సర్వే చేసి నివేదికను సిద్ధం చేశాయి.

ఉమ్మడి ఏపీలో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అగనంపూడి శివారున కొండకు ఆనుకుని 113 బ్లాక్‌లలో 3,616 ఇళ్లు నిర్మించారు. ఇంటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.1,96,500 మంజూరుచేశాయి. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు దశల వారీగా రూ.44 వేలు చెల్లించారు. రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ ... మిగతా 6వ పేజీలో

నగదుకు బదులు వస్తువులు

- వసతి గృహాల విద్యార్థులకు 'కాస్మొటిక్స్'పై ప్రభుత్వ నిర్ణయం
- ప్రస్తుతం విద్యార్థులకు ప్రతినెలా కొంత మొత్తం చెల్లింపు
- ఇకపై వస్తువులు పంపిణీ
- జిల్లాలోని 60 వసతి గృహాల్లో 5,000 మంది విద్యార్థులు



విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు మేలు చేకూర్చేలా ప్రభుత్వం మరో నిర్ణయాన్ని తీసుకుంది. ఇప్పటివరకూ కాస్మొటిక్స్ కోసం ప్రతినెలా కొంత మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తూ వస్తోంది. అయితే, ఈ మొత్తం చెల్లింపులో ఒక్కొక్కసారి జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులకు అవసరమైన కాస్మొటిక్ వస్తువులను తల్లిదండ్రులే కొనుగోలు చేసి ఇవ్వాల్సిన పరిస్థితి వస్తోంది. ఈ తరహా ఇబ్బందులు లేకుండా ఇకపై విద్యార్థులకు నగదుకు బదులుగా వస్తువులను అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల జిల్లాలోని బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సుమారు 60 వసతి గృహాల్లో ఉంటున్న సుమారు ఐదు వేల మందికి ప్రయోజనం చేకూరనున్నది.


కాస్మొటిక్ చార్జీలు పెంపు

తాజాగా ప్రభుత్వం కాస్మొటిక్ చార్జీల కింద ఇచ్చే మొత్తాన్ని పెంచింది. నెలకు మూడు నుంచి ఆరో తరగతి విద్యార్థులకు (బాలురు) రూ.100 నుంచి రూ.125కు, బాలికలకు రూ.110 నుంచి రూ.130కు పెంచారు. అలాగే, ఏడు నుంచి పదో తరగతి చదివే బాలురకు రూ.125 నుంచి రూ.150కు, బాలికలకు రూ.160 నుంచి రూ.200కు పెంచారు. ఇంటర్, ఇతర ఉన్నత విద్యా కోర్సులు చదివే విద్యార్థులు (బాలుర)కు ప్రస్తుతం నెలకు ... మిగతా 6వ పేజీలో

పిన్న వయసులోనే అవాస్క్యులర్ నెక్రోసిస్

కొవిడ్ తరువాత గణనీయంగా పెరిగిన బాధితులు

- కేజీహెచ్‌కు గతంలో నెలకు ఒకటి, రెండు కేసులు
- ఇప్పుడు రోజుకు రెండు...
- ఎముకకు రక్త ప్రసరణ నిలిచిపోవడంతో సమస్య ఉత్పన్నం
- స్టెరాయిడ్స్ వినియోగం కొంత కారణం
- ప్రాథమిక దశలో గుర్తించడం కీలకమంటున్న వైద్య నిపుణులు



విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత కొన్నాళ్లుగా అవాస్కులర్ నెక్రోసిస్ (ఏవీఎన్)/ ఆస్టియో నెక్రోసిస్ బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఎముకకు రక్త ప్రసరణ తగ్గడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందంటున్నారు. కేజీహెచ్‌లోని ఆర్థో విభాగం ఓపీకి కరోనాకు ముందు నెలకు ఒకటి, రెండు కేసులు వస్తే, ప్రస్తుతం రోజుకు ఒకటి నుంచి రెండు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. బాధితుల సంఖ్య కొన్ని రెట్లు పెరిగినట్టు వైద్యులు పేర్కొంటున్నారు.

ఏవీఎన్ అంటే ఏమిటి..?

ఎముకకు రక్త ప్రసరణ నిలిచిపోవడాన్ని అవాస్కులర్ నెక్రోసిస్ (ఏవీఎన్) అంటారు. శరీరంలో ఎక్కడైనా ఎముకకు రక్త ప్రసరణ నిలిచిపోతే ఆ భాగం ఏవీఎన్ బారినపడుతుందంటున్నారు. ఎక్కువగా తుంటి ఎముక, యాంకిల్ జాయింట్, రిస్ట్ భాగాల్లో సమస్య వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. కరోనా వైరస్ తరువాత రక్తనాళాల్లో మార్పులు, అధికంగా స్టెరాయిడ్స్ వినియోగం వంటివి ఈ సమస్యకు కారణమవుతున్నట్టు పేర్కొంటున్నారు. కొన్ని కారణాల వల్ల రక్త ప్రసరణ తగ్గిపోయి ఎముక కణజాలం చనిపోతుంది. రక్త ప్రసరణ ఉన్న సమయంలో గట్టిగా ఉండే ఎముక కణజాలం బోన్ డెడ్ అయిన తరువాత సాఫ్ట్‌గా మారిపోతుంది. దీనివల్ల శరీర బరువు తట్టుకోలేక ఆకృతి మారిపోతుంది. తత్ఫలితంగా తీవ్రమైన నొప్పి, మూవ్‌మెంట్ తగ్గిపోవడం, కుంటడం వంటి లక్షణాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. కరోనా సమయంలో వినియోగించిన స్టెరాయిడ్స్, ఇతర కారణాల వల్ల రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే ... మిగతా 6వ పేజీలో

ఫుడ్ ఫెస్టివల్ సూపర్ హిట్

పీఎంఆర్‌డీఏ పార్క్ వెనుక ఏర్పాటుచేసిన వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ సూపర్ హిట్ అయింది. దీనిని శుక్రవారం ప్రారంభించగా తొలి రోజే 20 వేల మంది వరకు వచ్చారని అంచనా. రెండో రోజు శనివారం అంతకు మించి సందర్శించారు. -8లో




శనివారం సాయంత్రం సందడిగా ఉన్న ఫుడ్ ఫెస్టివల్ ప్రాంగణం

15 నుంచి కార్పొరేటర్ల అధ్యయన యాత్ర

- తొమ్మిది రోజులపాటు ఉత్తర భారతదేశంలో పలు నగరాలు సందర్శన

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్ర పేరుతో ఈనెల 15 నుంచి పలు నగరాల్లో పర్యటించనున్నారు. కార్పొరేటర్లు అధ్యయనయాత్ర పేరుతో ఏటా దేశంలోని పలునగరాలను సందర్శిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది ఉత్తర భారతదేశంలోని పలు నగరాల్లో అధ్యయనయాత్ర నిమిత్తం రూ.1.5 కోట్లు వెచ్చించేందుకు ఇటీవల కౌన్సిల్ ఆమోదించిన విషయం తెలిసిందే. కార్పొరేటర్లు ఈనెల 15న విశాఖ విమానాశ్రయం నుంచి విమానంలో జోధ్‌పూర్ చేరుకుంటారు. 16న ఉదయం జోధ్‌పూర్ మునిసిపల్ కార్పొరేషన్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం అక్కడ స్థానికంగా ఉన్న ... మిగతా 6వ పేజీలో

ముగ్గురు ఎంపీడీవోలకు పదోన్నతి -6లో



వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

అవంతి విద్యార్థులకు ఉద్యోగాలు

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుకుని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన 1,110 మంది విద్యార్థులకు శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం జరిగింది.

రూ. 80 వేలకు లడ్డూ వేలం

మధురవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు శ్రీనివాస్‌నగర్‌లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన 109 కిలోల లడ్డూను సాయంత్రం వేలం వేశారు. స్వతంత్రనగర్‌కు చెందిన కర్రి రామారావు, చంద్రంపాలెంకు చెందిన పిళ్లా రాము సంయుక్తంగా వేలంలో రూ. 80 వేలుకు పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు.

సచివాలయం సేవలు అందేలా చూడండి

భీమునిపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడ మెట్టపాలెం గ్రామస్థులకు వారంలో మూడు రోజులు సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నరసింహారావును ఆ గ్రామ జనసేన నాయకులు కోరారు. శనివారం వారు ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందించారు.

పిన్న వయసులోనే అవాస్కులర్ నెక్రోసిస్

... 5వ పేజీ తరువాయి

తీరు పెరగడం వంటివి ఈ సమస్య తీవ్రత పెరగడానికి కారణమవుతున్నట్టు చెబుతున్నారు. ఆస్తమా, రుమటైడ్ ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మందులు వినియోగించిన వారిలోనే ఈ సమస్య కనిపిస్తున్నట్టు చెబుతున్నారు.

ఈ వయసు వారిలో ఎక్కువ..

గతంలో 50 ఏళ్లు దాటినవారు ఈ సమస్య బారినపడేవారు. ప్రస్తుతం యుక్త వయస్కులు అధికంగా కనిపిస్తున్నట్టు చెబుతున్నారు. ప్రతి పది కేసుల్లో ఆరు నుంచి ఏడు కేసులు 20 నుంచి 40 ఏళ్ల మధ్యవయస్కులు ఉంటున్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

అధిక సంఖ్యలో వస్తున్న కేసులు

డాక్టర్ చంద్రశేఖరంనాయుడు, ఆర్థో విభాగాధిపతి, కేజీహెచ్



ఏవీఎన్‌తో బాధపడుతూ ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు నెలకు ఒకటి, రెండు వస్తుండేవి. ఇప్పుడు ప్రతిరోజూ ఓపీలో ఒకటి, రెండు కేసులు చూస్తున్నాం. ఈ సమస్యను ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం తీసుకోవడం కీలకం. సమస్య గ్రేడ్ 1, 2లో ఉన్నప్పుడు వస్తే వారికి కోర్ డీ కంప్రెషన్, బోన్ మ్యారో యాస్పిరేషన్ కాన్సంట్రేషన్ అనే సర్జరీలు నిర్వహిస్తాం. బోన్ మ్యారో యాస్పిరేషన్ కాన్సంట్రేషన్ సర్జరీ బయట చేయించుకోవాలంటే చాలా ఖర్చవుతుంది. కేజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తున్నాం. గ్రేడ్ 3, 4లో వచ్చిన వారికి తీవ్రమైన ఇబ్బందులు ఉంటాయి. వారికి పరిస్థితిని బట్టి వైద్య సేవలు అందిస్తాం. శస్త్ర చికిత్సలు, వైద్య పద్ధతుల ద్వారా నిలిచిపోయిన రక్త ప్రసరణను మళ్లీ సరిచేసి కోలుకునేలా చేస్తాం.

నగదుకు బదులు వస్తువులు

... 5వ పేజీ తరువాయి

రూ.125 చెల్లిస్తుండగా, ఇకపై రూ.200, బాలికలకు రూ.150 నుంచి రూ.250కు పెంచారు. ఈ మొత్తంతో విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించనున్నారు. అలాగే బాలుర హెయిర్ కటింగ్‌కు రూ.30 చెల్లిస్తుండగా, ఈ మొత్తాన్ని రూ.50కు పెంచారు.

ఈ వస్తువులు అందజేత..

కాస్మొటిక్ చార్జీల కింద నగదుకు బదులుగా వస్తువులను కొనుగోలు చేసి ఇవ్వనున్నారు. ఇందులో కొబ్బరినూనె, టూత్ పేస్ట్, టూత్ బ్రష్, పౌడర్ డబ్బా, షాంపూ, సబ్బు ఉంటాయి. అమ్మాయిలకు శానిటరీ నాప్‌కిన్లు అందించనున్నారు. రెండు నెలలకు ఒకసారి వీటిని అందించనున్నారు. దీనిపై సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావును వివరణ కోరగా ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని, దీనివల్ల విద్యార్థులకు మేలు చేకూరుతుందని వివరించారు.

బై..బై..గణేశా

... 5వ పేజీ తరువాయి

నిమజ్జనం చేశారు. గాజువాక లంకా మైదానంలో లక్ష చీరల వినాయకుడి అనుప శనివారం సాయంత్రం నిర్వహించారు. లక్ష చీరలను భక్తులకు అక్కడే పంపిణీ చేస్తామని నిర్వాహకులు చెప్పగా పోలీసులు అంగీకరించలేదు. తోపులాట జరుగుతుందని, వేరే చోట ఇంకెప్పుడైనా, లేదంటే ఆన్‌లైన్‌లో పంపిణీ చేసుకోవాలని సూచించారు.

ప్రధాన రోడ్ల నిర్మాణంలో అలసత్వం వద్దు

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» జోన్-2 ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన రహదారుల నిర్మాణంలో అలసత్వం వహించొద్దని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం ఆయన నగరంలోని తన నివాసంలో జోన్-2 ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్-2 పరిధిలోని కొమ్మాది, పీఎంపాలెం, డబుల్ రోడ్, కైలాసగిరి-తిమ్మాపురం, లా కళాశాల - ఐటీ రోడ్, మిథిలాపురి లేఅవుట్-హరిత, మారికివలస - కాపులుప్పాడ వరకు ఉన్న 27 కిలోమీటర్ల రహదారులను మొదటి దశలో అభివృద్ధి చేయనున్నట్టు జీవీఎంసీ ఈఈ శాంతిరాజు ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే ఎన్‌వీపీ లా కళాశాల రహదారిలో ఉన్న ఎకరా స్థలంలో జోన్-2 కార్యాలయాన్ని మూడు అంతస్థుల్లో నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ ప్రతిపాదనను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రౌండ్ ఫ్లోర్‌లో శానిటేషన్,రెవెన్యూ విభాగాలు, ఫస్ట్ ఫ్లోర్‌లో ఇంజనీరింగ్,టౌన్‌ప్లానింగ్, జోనల్ కమిషనర్ ఆఫీస్, సెకండ్ ఫ్లోర్‌లో మీటింగ్ హాల్, క్యాంటీన్, గ్రీన్ రూమ్‌లు నిర్మించాలని సూచించారు. అలాగే ఎండాడ మెయిన్ రోడ్‌లో రహదారి వెంబడి ఉన్న హాకర్లు వల్ల తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయంగా ఎండాడ ప్రధాన రహదారికి సమీపంలో ఉన్న మూడు వేల చదరపు గజాల స్థలంలో హాకర్ల కోసం వాణిజ్య సముదాయం నిర్మించాలని తెలిపారు. వీటితో పాటు చంద్రంపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ రహదారి దాటడానికి ఇబ్బందులు పడుతున్నందున రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కూడా సహకరించాలని ఎమ్మెల్యే మెట్రో సంస్థ ఎండీ ఎన్‌పీ రామకృష్ణారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. వంతెన నిర్మాణానికి మెట్రో ప్రాజెక్టు అడ్డు వస్తోందని అధికారులు ఎమ్మెల్యేకు చెప్పడంతో ఆయన మెట్రో సంస్థ ఎండీతో మాట్లాడారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి విషయంలో సాంకేతిక అంశాలను అధ్యయనం చేసి బ్రిడ్జి నిర్మాణానికి సహకరిస్తామని ఎండీ హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే గంటా తెలిపారు.

వైసీపీ నేత అక్రమ భవనం కూల్చివేత

బక్కన్నపాలెం మాస్టర్ ప్లాన్ రహదారి నిర్మాణానికి తొలగిన అడ్డంకి



భవనాన్ని తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కొమ్మాది, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ బ్రిడ్జి కింద నుంచి బక్కన్నపాలెం వరకూ చేపట్టనున్న మాస్టర్ ప్లాన్ రహదారి నిర్మాణానికి ఉన్న అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. వైసీపీకి చెందిన మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు భవనం రహదారి ప్రారంభంలో ఉండడంతో ఎన్నో ఏళ్లుగా ఆ రహదారి విస్తరణకు నోచుకోలేదు. ఇటీవల వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఈ రహదారిని పరిశీలించి స్థల యజమానులతో మాట్లాడారు. యజమానులు తమకు ఇంకా టీడీఆర్ పూర్తిస్థాయిలో అందలేదని, భవనం ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఈనేపథ్యంలో కమిషనర్‌కు, వారికి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. వెంటనే సర్వే చేసి టీడీఆర్ ఇవ్వాల్సి వస్తే ఇస్తామని, రహదారి నిర్మాణానికి సహకరించాలని కమిషనర్ వారిని కోరారు.సర్వే చేసి, పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. శనివారం జీవీఎంసీ అధికారులు పోలీసుల సహకారంతో డీసీపీ హరిదాసు, ఏసీపీ శబ్బం శాస్త్రి పర్యవేక్షణలో రహదారి నిర్మాణానికి అవసరమైన భవనంలోని కొంత భాగాన్ని తొలగించారు. స్థల యజమానులు, వారి కుటుంబీకులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. పీఎంపాలెం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. స్థల యజమానులు తమకు ఇంకా టీడీఆర్ వస్తుందని, ఈ విషయం కోర్టులో ఉండగా భవనాన్ని ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. కాగా ఈ విషయమై జోన్-2 ఏసీపీ శాస్త్రిని వివరణ కోరగా స్థల యజమానులకు టీడీఆర్ ఇచ్చామని, కోర్టు ఉత్తర్వుల ప్రకారమే భవనం తొలగించామని చెప్పారు.



ఆలయంలో భక్తుల రద్దీ

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాలకు చెందిన భక్తులు వేకువజామున సింహాచలం చేరుకున్నారు. పుష్కరిణిలో స్నానాలు ఆచరించి భైరవ స్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కొందరు, మెట్ల మార్గంలో మరికొందరు సింహగిరికి చేరుకుని అప్పన్నను దర్శించుకున్నారు.

హెరిటేజ్ ఫెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం

ఆనందపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీ పరిధిలోని ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన హెరిటేజ్ ఫెస్ట్ - 2025 విజేతలకు శనివారం ఆ సంస్థ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస బహుమతులు ప్రదానం చేశారు. గత నెల 2 నుంచి 11వ తేదీ వరకు హెరిటేజ్ - 2025 ఫెస్ట్ నిర్వహించారు.

రంగస్థల కళాకారుడు బాలుకు జాతీయ పురస్కారం

పద్మనాభం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):మద్ది గ్రామానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు, తేనె తెలుగు కల్చరల్ ట్రస్టు గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సామవేదం బాల సుబ్రహ్మణ్యంకు నాట్య కళా ప్రపూర్ణ బళ్లారి రాఘవ జాతీయ పురస్కారం లభించింది. శనివారం రాత్రి కర్ణాటకలోని బళ్లారిలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహ కులు ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. రంగస్థల కళాకారుడిగా విభిన్న పౌరాణిక, సాంఘిక నాటకాల్లో వందలాది పాత్రలు పోషించడమే కాకుండా ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దినందుకు నిర్వాహకులు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

చేతులు మారిన కాలనీ ఇళ్లు

... 5వ పేజీ తరువాయి

సదుపాయాలు కల్పించారు. పాఠశాల, సామాజిక భవనాలు నిర్మించారు. అయితే అప్పట్లో గాజువాకకు దూరంగా ఉండడంతో చాలాకాలం లబ్ధిదారులు కాలనీకి వెళ్లలేదు. కొద్దిమంది మాత్రమే తొలుత అక్కడ నివాసం ఏర్పాటుచేసుకోగా, తరువాత నెమ్మదిగా మరికొందరు వెళ్లారు. ఇంకా కొందరు రాకపోవడంతో దానిని అవకాశంగా తీసుకుని రౌడీమూకలు ఖాళీగా ఉన్న ఇళ్లను తప్పుడు పత్రాలు సృష్టించి తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి. కాలనీలో లబ్ధిదారులు ఉంటున్నారా? లేదా అనే దానిపై గతంలో హౌసింగ్ అధికారులు ఒకసారి సర్వే చేశారు. ఇళ్లలో నివాసాలు లేనివారిని గుర్తించి నోటీసులు ఇచ్చి కేటాయింపులు రద్దు చేశారు. కొందరు అప్పటికప్పుడు అధికారులను కలిసి విన్నవించుకోగా సమాచారం లేని మరికొందరు పట్టించుకోలేదు. ఇటువంటి ఇళ్లను ఇతరులకు కేటాయించినపుడు హౌసింగ్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందనే వాదన వినిపించింది.

కాగా 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అగనంపూడి కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్లను తమకు కేటాయించాలని గాజువాకు చెందిన పేదలు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీలో తాజా పరిస్థితిపై విచారణ చేయాలని కోరిన వెంటనే కలెక్టర్ పూర్తిస్థాయిలో ప్రతి ఇంటికీ బృందాన్ని పంపి వాస్తవాలు సేకరించారు. మొత్తం 3,616 ఇళ్లలో 298 మంది లబ్ధిదారులు తమ ఇళ్లను ఇతరులకు విక్రయించేసి వెళ్లిపోగా 2012లో ఇళ్లు కేటాయించినా ఇంత వరకు గృహ ప్రవేశాలు చేయనివారు 494 మంది ఉన్నట్టు విచారణలో తేలింది. కాలనీలో 943 మంది నివాసం ఉండగా, 168 ఇళ్లలో ఇతరులు అద్దెకు ఉంటున్నారు. మరో నాలుగు ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు చనిపోయినట్టు గుర్తించారు. విచారణ సమయంలో 1,709 ఇళ్లకు తాళాలు వేసినట్టు గుర్తించారు. విచారణ బృందాలు వస్తున్న విషయం తెలుసుకున్న కొందరు బినామీలు, అనధికారికంగా ఆక్రమించిన వ్యక్తులు అప్రమత్తమై ఇళ్లకు తాళాలు వేసినట్టు అనుమానిస్తున్నారు.

రౌడీమూకలు ముఠాగా ఏర్పడి పదుల సంఖ్యలో అనధికారింగా ఆక్రమించడం లేదా అద్దెకు ఇవ్వడం చేశారని కాలనీలో పలువురు చెబుతున్నారు. హౌసింగ్ అధికారులు విచారణ నివేదికను త్వరలో కలెక్టర్‌కు అందజేయనున్నారు. దీని ప్రకారం అనర్హులను ఏరివేసి ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.



పోస్టాఫీసు వీధిలో అన్న సమారాధన

సింహాచలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పోస్టాఫీసు వీధిలో సింహాద్రి యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్న సమారాధన నిర్వహించారు. కార్పొరేటర్ పివి నరసింహం ప్రారంభించిన ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు చంద్రశ్రీనివాసరావు, బూర్లె కనకారావు, అవినాష్‌బాబు, రౌతు రాంబాబు, కర్రి అప్పలస్వామి, సత్తిబాబు పాల్గొన్నారు.

ఆరుగుర్ని కాపాడిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలకు వెళ్లి ప్రమాదానికి గురైన ఆరుగురిని లైఫ్‌గార్డులు కాపాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మనిగోస్వామి (21), లోకేశ్ ఆరత్ (22), ప్రియాంక (20), బోసు ప్రధాన్ (29), ఆంచల్ రాణా (22) శనివారం రుషికొండబీచ్‌కు విహారానికి వచ్చారు. అల్పపీడనాల నేపథ్యంలో రెండు రోజులుగా సముద్రం అల్లకల్లోలంగా ఉంది.ఈవిషయం తెలియని వారు సముద్ర స్నానాలకు దిగారు. పెద్ద అల వారిని తాకడంతో సముద్రంలోకి కొట్టుకుపోతుండగా సమీపంలో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డులు గమనించి రక్షించారు. మరో ప్రమాదంలో ఒడిశాకు చెందిన గనేశ్ గిరి (29)ని కూడా లైఫ్‌గార్డులు రక్షించారు.

నవంబరుకల్లా అనకాపల్లికి పోలవరం నీరు

... 5వ పేజీ తరువాయి

కలెక్టరేట్‌లో జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. అందులో చర్చించిన అంశాలు,చేసిన తీర్మానాల వివరాలు విలేకరుల సమావేశంలో మంత్రి వెల్లడించారు. విశాఖ నగరం, పారిశ్రామిక సంస్థలకు అవసరమైన నీరు పోలవరం నుంచి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పోలవరం నుంచి వచ్చే నీటిని నిల్వ చేయడానికి 4.5 టీఎంసీల సామర్థ్యంతో చెరువుల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు జీవీఎంసీ నుంచి నిధులు ఇచ్చేలా ఆదేశించామన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వేసవిలో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా జీవీఎంసీ చర్యలు తీసుకుంటుందన్నారు.నగరంలో నైరుతి రుతుపవనాల సీజన్‌కు ముందు సగటున ఎనిమిది మీటర్లు, ఆ తరువాత మూడు మీటర్లలోతు వరకూ భూగర్భ జలాలు ఉండేలా కార్యాచరణ అమలుకు నిర్ణయించామన్నారు.పారిశుధ్య సమస్యపై పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుని నగరంలో కొత్తగా తాత్కాలిక విధానంలో పారిశుధ్య కార్మికులను నియమించాలని నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి తెలిపారు. వీధి దీపాల నిర్వహణ మెరుగుపరచాలని అధికారులకు ఆదేశించామన్నారు. టిడ్కో ఇళ్ల సమస్యపై అసెంబ్లీలో చర్చించాలని సమావేశం తీర్మానించిందన్నారు. నగరంలో పలు ప్రాజెక్టుల పురోగతికి అవరోధంగా ఉన్న సమస్యలపై చర్చించడానికి రైల్వే, పోర్టు, తూర్పు నౌకాదళం అధికారులు, జిల్లా అధికారులతో కమిటీ ఏర్పాటుచేశామన్నారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని నిర్ణయించామన్నారు. దీపం-2 పథకం కింద ఉచిత సిలిండర్ల సబ్సిడీ సొమ్ము జమకాని లబ్ధిదారులకు సాయం అందించేందుకు చర్యలు తీసుకునేలా ఆదేశించామన్నారు. జిల్లాలో ఉపాధి కల్పనకు ముందుకు వచ్చే సంస్థలకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలు గుర్తించి ఇవ్వనున్నామన్నారు. సచివాలయాల్లో ప్రింటర్ల కొరత తీర్చడానికి టెండర్లు ఆహ్వానిస్తామన్నారు. ప్రభుత్వ శాఖలపై కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులపై త్వరలో సమీక్షించనున్నట్టు మంత్రి తెలిపారు. కేజీహెచ్‌లో డయాలసిస్ యూనిట్లు పూర్తిగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని ఒక ప్రశ్నకు బదులుగా మంత్రి తెలిపారు. ప్రైవేటు అంబులెన్స్‌ల దందాపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిస్తానని మంత్రి తెలిపారు. గత సమీక్షా సమావేశంలో చర్చించిన అంశాలను పరిష్కరించామని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి, విష్ణుకుమార్‌రాజు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు పాల్గొన్నారు.

ముగ్గురు ఎంపీడీవోలకు పదోన్నతి

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ముగ్గురు ఎంపీడీవోలకు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులుగా పదోన్నతి లభించింది. పాయకరావుపేట ఎంపీడీవో ఎ.జయప్రకాశరావుకు పాడేరు డీడీవోగా, పద్మనాభం ఎంపీడీవో ఎం.విజయకుమార్‌కు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే డిప్యూటేషన్‌పై రుషికొండలో గిరిజన సంక్షేమ శాఖ కల్చరల్ ఇనిస్టిట్యూట్‌లో అసోసియేట్ ఆచార్యునిగా పనిచేస్తున్న జి.చంద్రకళకు పదోన్నతి ఇచ్చి అదే పదవిలో కొనసాగాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా డీడీవోలుగా పదోన్నతి పొందిన వారిలో గన్నవరం ఎంపీడీవోను అల్లూరి జిల్లా డ్వామా కార్యాలయంలో ఏపీడీగా, పామర్రు ఎంపీడీవో కె.జ్యోతిని ఏపీవోగా, పెద్దాపురం ఎంపీడీవో డి.శ్రీలలితను విశాఖ జిల్లా డ్వామా కార్యాలయంలో విజిలెన్స్ అధికారిగా నియమించారు.

సింహగిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో గోవిందరాజస్వామి

సింహాచలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారంతో ముగిసాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగిన ఉత్సవాల్లో దోషాల పరిహారార్థం ఏటా బాద్రపద మాస శుక్ల పక్ష దశమి నుంచి ఐదు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఈనెల 2న అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఐదు రోజుల పాటు ఉభయ సంధ్యలలో విశేష హోమాలు జరపడంతో పాటు చతుర్వేదాలు, రామాయణ, ఇతిహాసాలు, విష్ణు పురాణం, క్షేత్ర మహాత్మ్యం వంటి పురాణాలు, విష్ణు సహస్ర నామాలు, భగవద్గీత తదితర పారాయణలు నిర్వహించారు. ప్రత్యేకంగా రప్పించిన పవిత్రాలకు పూజలు చేసి వాటిని ఆలయంలోని మూలవిరాట్‌కు, అర్చా మూర్తులకు, శిఖరాలకు అలంకరించారు. చివరి రోజు సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు తరువాత వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారికి ఏకాంతంగా స్నపన తిరుమంజన సేవ చేసి, ఉత్సవాలను ముగించారు. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయ బేడామండపంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి బి సత్యశ్రీనివాస్ పర్యవేక్షించారు.

వెళ్లొస్తా...



గొల్లవీధిలో విగ్రహం ఊరేగింపు

భీమునిపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గొల్లవీధి, ఎగువపేట, శెట్టిబలిజ వీధి, అప్పికొండ వీధి, నల్లివీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శనివారం రాత్రి నిర్వాహకులు గోస్తనీ సాగర సంగమంలో నిమజ్జనం చేశారు. విగ్రహాలను బీచ్ రోడ్‌లోని సాగర సంగమం ప్రవేశద్వారం వద్దకు తీసుకువచ్చి అక్కడ ఏర్పాటు చేసిన రెండు భారీ క్రేన్‌ల సహాయంతో వాహనాల నుంచి కిందకు దించారు. అక్కడ నుంచి గజ ఈతగాళ్ల సహాయంలో తీరానికి తొడ్కొని వెళ్లి నిమజ్జనం చేశారు. నార్త్ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో భీమిలి సీఐ తిరుమలరావు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నీటి తొట్టెలో వినాయకుడి నిమజ్జనం

కొమ్మాది : పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద పద్మసాయి ఆలయ ఆవరణలో నీటి తొట్టె ఏర్పాటు చేసి అందులో గణేశ్ ప్రతిమను నిమజ్జనం చేశారు. పర్యావరణానికి హాని తలపెట్టకుండా ఏటా వినాయక విగ్రహాలను ఇలానే నిమజ్జనం చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మహా అధ్వానం

... 5వ పేజీ తరువాయి

తలెత్తుతుందని పేర్కొన్నారు. అందుకు జీవీఎంసీ కమిషనర్ స్పందిస్తూ నగరంలో 250 మురుగు కాల్వలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. పోర్టు, రైల్వే రక్షణ శాఖ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు.

నగరంలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడంలేదని ఎమ్మెల్యేలు వెలగపూడి, విష్ణుకుమార్‌రాజులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాటిచెట్లపాలెం, ధర్మానగర్, కంచరపాలెం మెట్టు, కొండవాలు ప్రాంతాలు రాత్రి పూట అంధకారంలో ఉంటున్నాయని విష్ణుకుమార్‌రాజు ఆందోళన వ్యక్తంచేశారు. రాత్రి రెండు గంటలకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లే సమయంలో పెదజాలారిపేటలో హైమాస్ట్ లైట్లు వెలగక చీకటిగా ఉండడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని వెలగపూడి వివరించారు. 26, 43, 46, 47 వార్డుల్లో జీవీఎంసీలో గోస్టు వర్కర్లు ఉన్నారని విష్ణుకుమార్‌రాజు అధికారుల దృష్టికి తీసుకురాగా మంత్రి జోక్యం చేసుకుని విచారణ చేయాలని ఆదేశించారు. కొండవాలు ప్రాంతాలతో పాటు పలుచోట్ల ప్రజలకు తాగునీరు సరిగ్గా అందడం లేదని ఎమ్మెల్యేలంతా ఆందోళన వ్యక్తంచేశారు. ఈ దశలో మంత్రి మాట్లాడుతూ నగర ప్రజల అవసరాలను అనుగుణంగా నీటి నిల్వలు పెంచుకునే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గణబాబు మాట్లాడుతూ మేహాద్రిగెడ్డ, గంభీరం రిజర్వాయర్‌లలో పూడిక తీయాలన్నారు. ముడసర్లోవలో పూడిక తీయడంతోపాటు సామర్థ్యం పెంచాలని వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. ఈ దశలో మంత్రి జోక్యం చేసుకుని తాటిపూడి రిజర్వాయర్ నుంచి ప్రస్తుతం వస్తున్న నీటికి అదనంగా మరికొంత నగరానికి తీసుకురావాలని అనడంతో అందుకు ప్రభుత్వ అనుమతి అవసరమని సంబంధిత అధికారులు తెలిపారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ పోలవరం నీటిని వినియోగించుకునేందుకు అదనంగా 4.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కోసం కొన్ని చెరువులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు డీసీసీబీ నుంచి రుణాలు మంజూరుచేయాలని ఎమ్మెల్యే గణబాబు కోరగా, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ రుణాల మంజూరుపై ఆప్కాబ్‌లో చర్చించాలని, ఇంకా అందుకు ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలన్నారు. జిల్లాలో స్వయంశక్తి సంఘాలకు తక్కువ వడ్డీకి డీసీసీబీ ద్వారా రుణాలు అందజేసేందుకు యూసీడీ, డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణ ప్రక్రియ మందకొడిగా సాగుతుందని ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు ఆందోళన వ్యక్తంచేశారు. దానిపై సచివాలయాల సిబ్బందికి అవగాహన లేదని, తహశీల్దార్ల ద్వారా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ వేపగుంట-పినగాడి రోడ్డుకు మోక్షం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. నగరానికి గ్రామీణ ప్రాంతాలకు కనెక్టివిటీ రోడ్లు అభివృద్ధి చేయాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాకలో భూముల క్రమబద్ధీకరణ జరిగిన స్థలాలకు టైటిల్ డీడ్ మారడం లేదన్నారు. స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపోను ఖాళీ చేయాల్సిందిగా ఉక్కు యాజమాన్యం నుంచి ఒత్తిడి తీసుకువస్తున్నందున కొత్తగా స్థలం కేటాయించాలని కోరగా, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు జోక్యం చేసుకుని ఉక్కు పరిధిలో డిపోను ఎందుకు తరలించాలని ప్రశ్నించారు.

అభివృద్ధి పరుగులు పెట్టాలి: మంత్రి

క్లీన్ సిటీ, స్మార్ట్ సిటీ అయిన మహా విశాఖ నగర అభివృద్ధిపై అధికారయంత్రాంగం ప్రధానంగా దృష్టిసారించాలని ఇన్‌చార్జి మంత్రి శ్రీవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. నగరంలో అభివృద్ధి పరుగులు పెట్టాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అంశాల వారీగా సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అన్ని శాఖల నుంచి నాణ్యమైన సేవలు అందాలని, ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వారికి అందాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకువెళ్లాలన్నారు. మేహాద్రిగెడ్డ, ముడసర్లోవ, గంభీరం రిజర్వాయర్ల నిర్వహణ మరింత మెరుగుపడాలన్నారు. కోర్టు కేసులపై ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయాలని కలెక్టర్‌కు సూచించారు. కొన్ని అంశాలపై స్పష్టంగా సమాధానాలు చెప్పని అధికారులపై మంత్రి అసహనం వ్యక్తంచేశారు. వచ్చే సమావేశానికి పక్కా సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఏపీ ఆయిల్ గ్రోవర్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్లు కేతన్‌గార్గ్, కేఎస్ విశ్వనాథన్, డీసీపీ మేరీ ప్రశాంతి, డీఆర్వో భవానీశంకర్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత మాథుర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

15 నుంచి కార్పొరేటర్ల అధ్యయన యాత్ర

... 5వ పేజీ తరువాయి

పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారు. 17న జోధ్‌పూర్ నుంచి అజ్మీర్, పుష్కర్ వెళ్లి రాత్రికి తిరిగి జోధ్‌పూర్ చేరుకుంటారు. 18న జోధ్‌పూర్ కార్పొరేషన్ పరిధిలో అమలవుతున్న ప్రాజెక్టులను పరిశీలిస్తారు. 19న జైసల్మీర్ వెళ్లి అక్కడ పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారు. 20న జైసల్మీర్‌లోనే ఇతర సందర్శనీయ ప్రాంతాలకు వెళతారు. 21న జైసల్మీర్ నుంచి బికనీర్ మీదుగా ఢిల్లీ వెళతారు. 22న ఢిల్లీలో వివిధ ప్రాంతాలు సందర్శిస్తారు. 23న ఢిల్లీ నుంచి విమానంలో తిరిగి విశాఖ చేరుకుంటారు. ఇదిలావుంటే అధ్యయన యాత్రల పేరుతో గత నాలుగేళ్లు ఉత్తర భారతదేశంలో పలు నగరాలను సందర్శించిన కార్పొరేటర్లు ఏం అధ్యయనం చేశారు?, అక్కడ ఉత్తమ ప్రాజెక్టులుగా గుర్తించిన వాటిలో ఎన్నింటిని నగరానికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకున్నారు?...అనే ప్రశ్నిస్తే మాత్రం ఒక్క కార్పొరేటర్ కూడా నోరువిప్పరు.

సాగు..తున్న డ్రైనేజీ పనులతో అవస్థలు

» 22వ వార్డులో నాలుగు నెలలుగా పూర్తి కాని వైనం
» ఎక్కడికక్కడే రోడ్లకు గోతులు, మట్టి కుప్పలు
» చెత్తాచెదారంతో నిండిన రహదారులు


కళాభారతి పక్క రోడ్డులో అడ్డంగా వేసిన చెత్తాచెదారాలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో పనుల పూర్తి చేయకుండా నెలల తరబడి డ్రైనేజీ. ఫుట్‌పాత్ పనులు చేపడుతుండడంతో 22వ వార్డులో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వార్డులో రోడ్ల మీద మట్టి కుప్పలు.. గుట్టలుగా పోసిన నిర్మాణ వ్యర్థాలు..గోతులు తవ్విన రహదారులు.. చెత్తాచెదారాలు నిండి మూసేసిన రహదారులే దర్శనమిస్తున్నాయి. పిఠాపురంకాలనీ రహదారిలో డ్రైనేజీ, ఫుట్‌పాత్ పనులు చేపట్టారు. నాలుగు నెలలు కావస్తున్న ఈ పనులు సాగుతూనే ఉన్నాయి. పోనీ కిలో మీటర్ల పొడవునా పనులంటే అదీ కాదు. కేవలం పిఠాపురం కాలనీలో దాదాపు 300 మీటర్ల రహదారికి ఇరువైపులా డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మాణం చేస్తున్నారు. రోజుకు పది మీటర్లు పని చేసినా నెల రోజుల్లో పూర్తి చేయవచ్చు. కానీ 120 రోజులు దాటుతున్నా ఈ పనులు పూర్తికాకపోవడం గమనార్హం. ఫలితంగా పిఠాపురంకాలనీ అస్తవ్యస్తంగా తయారైంది.

ఎక్కడికక్కడే మట్టికుప్పలు..

పిఠాపురం కాలనీ రహదారిలో ఎక్కడికక్కడే మట్టికుప్పలు పేరుకుపోయాయి. గోతులు తీసిన మట్టిని వెంటనే తొలగించకపోవడంతో గుట్టలుగా మారాయి. నాలుగు నెలల కిందట తీసిన ఈ గోతుల మట్టిని ఇప్పటి వరకూ తొలగించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చినుకులు పడితే రహదారులు మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. మరో పక్క.. డ్రైనేజీల నిర్మాణం చేసిన వ్యర్థాలు గుట్టలుగా పోశారు. కళాభారతి పక్కన రోడ్డును చెత్తచెదారాలతో మూసివేశారు.ఈ రహదారిలో ప్రయాణాలు చేయడానికి వాహనదారులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

వార్డులోని సందుల్లో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనులు పరిస్థితి ఇలానే ఉంది. పనుల కోసం తవ్విన రోడ్లు అసంపూర్తిగా పూడ్చి చేతులు దులుపుకున్నారు. నెలల తరబడి ఇష్టానుసారంగా పనులు కొనసాగి..స్తున్నా అడిగే నాథుడే కరువయ్యారు. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడే చెత్తకుప్పలు దర్శనమిస్తూ వైఫల్యాన్ని వెక్కిరిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరతగతిన పనులు పూర్తి చేయించి, రహదారులు శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పిఠాపురం కాలనీలో గుట్టలుగా ఉన్న మట్టి

‘11వ వార్డులో నీటి ఎద్దడి సమస్య పరిష్కరించాలి’

ఆరిలోవ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11వ వార్డులో తీవ్ర నీటి ఎద్దడి నెలకొని ఉందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలని తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ప్రియాంక దండి కోరారు. శనివారం ఆమెను కాంగ్రెస్ వార్డు అధ్యక్షుడు వెంకటేశ్ కలిసి సమస్య వివరించారు. దీనిపై ప్రియాంక దండి మాట్లాడుతూ.. 11వ వార్డులో నీటి ఎద్దడి సమస్యలను తీర్చేందుకు జీవీఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యపై మేయర్ పీలా శ్రీనివాసరావుకు కూడా వినతిపత్రం అందించినట్టు చెప్పారు. తాగునీటి కోసం కొళాయిల వద్ద మహిళలు గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోందన్నారు.

దీనివల్ల పేద ప్రజలు కూలికి వెళ్లలేని దైన్య స్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి జీవీఎంసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రియాంక దండి కోరారు.

వాడవాడలా ఘనంగా గణనాథుడి నిమజ్జనాలు

» వినాయకుడికి ప్రత్యేక పూజలు » సందడిగా లడ్డూల వేలం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డుల్లో శనివారం సాయంత్రం వాడవాడలా గణనాథుడి నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. వెంకోజీపాలెం శ్రీసీతారామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య దంపతులు, శ్రీసీతారామ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు, యువకులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం చేపట్టిన 50 కిలోల లడ్డూ వేలం పాటలో మండపం సమీపానున్న పల్లవి జ్యూవెలర్స్ యజమాని రూ.10 వేలకు సొంతం చేసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో గణనాథుడిని ఊరేగించి, నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, జనసేన నాయకులు పీలా వెంకటపరదేశినాయుడు, శ్రీసీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు కర్రి వెంకటసూరిఅప్పారావు, ఇతర కార్యవర్గ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఎల్లమాంబనగర్‌లో చిన్నారులునిర్వహించిన వినాయక ఉత్సవాలు కూడా ముగిశాయి. మహిళలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అందరిని అలరించారు. అలాగే హెచ్‌బీ కాలనీలోని బాయ్స్ అండ్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఉత్సవాలు కూడా శనివారం ముగిశాయి. జీవీఎంసీ 15వ వార్డు శ్రీశెట్టిబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఉత్సవాలు ముగియడంతో గణనాథుడి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 28, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 24, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 46, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 70, బరబాటి 42, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామ కాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

వినాయక ఉత్సవంలో అన్న సమారాధన


వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి కుమారుడు ప్రతాపరుద్ర

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల ముగింపు నేపథ్యంలో ఎంవీపీ కాలనీ, పరిసర ప్రాంతాల్లో అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు, తెలుగుదేశం యువ నాయకుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయా పందిర్ల వద్ద జరిగిన కార్యక్రమాల్లో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ సర్కిల్ వద్ద బిల్డర్స్ అసోసియేషన్, జీవీఎంసీ 18వ వార్డు పరిధిలో, పెద జాలారిపేట తదితర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

21వ వార్డులో ప్రత్యేక పూజలు..

జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరు రజికవీధిలో బాలగణేష్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర నమూనా వన్‌గ్రామ్ గోల్డ్‌తో చేసిన 17 అడుగుల వినాయక విగ్రహాన్ని శనివారం వెలగపూడి ప్రతాప్‌రుద్ర శని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయుకులు మురళీ, కమిటీ సభ్యులు ప్రసాద్, హేమంత్, భాను, రవి, అభి ఇతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కొంపెర్ల నారాయణ మూర్తికి సత్కారం

ఆరిలోవ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కాలేజీలో శుక్రవారం జరిగిన ఆల్ ఇండియా సర్జన్స్ కాన్ఫరెన్స్-ఆంధ్రప్రదేశ్ చాప్టర్‌లో ప్రసిద్ధ శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ కొంపెర్ల నారాయణ మూర్తి వైద్య శాస్త్రంపై ఆయన చేసిన ఉపన్యాసం ప్రతిష్టాత్మకమైనది హాజరైన వైద్య బృందం పేర్కొంది. ఈ సంధర్భంగా అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా-ఏపీ చాప్టర్ ఆయనను ఘనంగా సత్కరించింది.


డాక్టర్ నారాయణమూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

11న ఆటోవాలాల చలో కలెక్టరేట్

» ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అలాగే ఉచిత బస్సు ప్రయాణం వలన ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లను తక్షణమే ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 11న నిర్వహించే ఆటోవాలా చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ పిలుపునిచ్చారు. శనివారం కృష్ణా కళాశాల సమీపంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల గోవింద్ మాట్లాడుతూ ఓలా, ఓబర్, రాపిడ్ ఆన్‌లైన్ యాప్‌ల నుంచి ద్విచక్రవాహనాల బుకింగ్‌ను వెంటనే తొలగించాలని, ఆటో అండ్ మోటార్ డ్రైవర్లకు వాహనమిత్ర పథకం రూ.15 వేలు వెంటనే బ్యాంకు అకౌంట్‌లో వేయాలని, ఆటో అండ్ మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాహనాల మీద అధిక జరిమానాలు విధించే జీవో నెంబరు 21, 31లు వెంటనే సవరించాలని తదితర డిమాండ్లతో నిర్వహించే చలో కలెక్టరేట్‌లో ఆటో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు ఎన్.మధురెడ్డి, దల్లినాని, షేక్ బాషా, పి.కృష్ణ నాయుడు, శ్రీనివాస్, చంటి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పడాల గోవింద్

సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు

» గడిచిన 12 రోజులకు రూ.14,55,243 ఆదాయం


హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్

సిరిపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపును శనివారం కార్యాలయ ఆవరణలో చేపట్టినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. గడిచిన 12 రోజులకు రూ.14,55,243 నగదు రాగా, బంగారం 000-005-100 గ్రాములు, వెండి 000-101.100 గ్రాములు వచ్చాయన్నారు. యూఎస్‌ఏ డాలర్స్ 21, ఒమాన్ రీయల్స్ 4, బైసా 100, కెనడా 10 డాలర్స్, యూరో 10, ఇంగ్లాండ్ 10 పౌండ్స్ వచ్చినట్టు వెల్లడించారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి జగన్నాథస్వామి ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి పర్యవేక్షించగా, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది లెక్కించినట్టు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, బీఎస్ మూర్తి, డి.ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

పెదవాల్తేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 20వ వార్డు లోని పెదవాల్తేరు వద్ద గల వేంకటేశ్వర స్వామి దేవాలయం అవరణలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు విచ్చేసి కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో దేవాలయాల్లో భక్తుల సదుపాయాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తోందన్నారు. నూతన ధర్మకర్తల మండలి సేవాభావంతో పని చేసి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆలయ నూతన ధ ర్మకర్తల మండలి ఛైర్మన్‌గా బైరెడ్డి గోవింద రెడ్డి, సభ్యులుగా అలజంగి ఈశ్వర రావు, నానాజీ, చిల్లకాట మణి, జగన్నాథ పద్మావతి, దశరథరామయ్య, గొర్లె సుందరి, దేముడు బాబు, జలగడుగుల రాధిక ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె వెంకట పట్టాభిరామ్, టీడీపీ నాయ కులు బైరెడ్డి పోతన్నరెడ్డి, బొట్ట రమణ, కాళ్ల శంకర్, పీతల అమరేంద్ర, గొలగాని పోలరావు, చిన్నిపిల్లి ఆనందరెడ్డి, చిన్నిపిల్లి నరేంద్ర, తారక్, గోపి, తెడ్డు రాజు, శివారెడ్డి, దేవస్థానం ఈవో ఆదినారాయణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

9న వైసీపీ అన్నదాత పోరు : కేకే రాజు

మద్దిలపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొరతతో పాటు రైతుల ఇతర సమస్యలపై ఈ నెల 9న ‘అన్నదాత పోరు’ అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తెలిపారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ‘అన్నదాత పోరు’ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియా కొరతతో రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ నేతలు కమిషన్లతో ఒక్కో యూరియా బస్తాను రూ.700 విక్రయిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న యూరియా కోసం రైతులను భిక్షగాలుగా మార్చారన్నారు. గిట్టుబాటు ధరలు లేక మిర్చి, పత్తి, ఉల్లి రైతులు అల్లాడుతున్నారన్నారు. అందుకే రైతులకు బాసటగా వైసీపీ ‘అన్నదాత పోరు’ పేరుతో నిరసనకు పిలుపు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మొల్లి అప్పారావు, నాయకులు రవిరెడ్డి, వెంకట్రామయ్య, అనురాధ తదితరులు పాల్గొన్నారు.


అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేకే రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ తదితరులు

‘సచివాలయ ఉద్యోగులను మాతృశాఖల్లో పని చేసే అవకాశం కల్పించాలి’

రామ్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులు తమ మాతృ శాఖలలో పనిచేసే అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేశ్‌కుమార్ డిమాండ్ చేశారు.

శనివారం అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమా వేశం వారి కార్యాలయంలో నిర్వహించారు.

ఈ సమావేశంలో సచివాలయ సిబ్బంది ఎదు ర్కొంటున్న సమస్యలు, పని ఒత్తిడి, ప్రభుత్వ తీరుపై విస్తృతంగా చర్చించారు ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు తక్షణ ఆత్మగౌరవ సమస్యగా మాతృశాఖలో పనిచేసే అవకాశం కల్పించడంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని స్పష్టమైన ఆదేశాలు వెలువరించాలని కోరారు.

డీఎస్సీ ర్యాంకర్లకు ఏయూ వీసీ అభినందనలు

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో పీజీటీ సివిక్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన బొల్లోజు హరీష్, టీజీటీ సోషల్ విభాగంలో ప్రథమస్థానం సాధించిన బొమ్మిడి డిల్లేష్‌లను ఏయూ వీసీ జీవీ రాజశేఖర్ తనకార్యాలయంలో శనివారం అభినందించారు. ఏయూ విద్యా విభాగానికి చెందిన ఈ ఇరువురు విద్యార్థులు డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాకులు సాధించారు.

గ్రహణం కారణంగా నేడు, రేపు ఆలయాల్లో దర్శన వేళల్లో మార్పు

మురళీనగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి దర్శన వేళల్లో స్వల్ప మార్పులు చేసినట్లు ఆలయ ఈఓ బి.ప్రసాద్ తెలిపారు. శ్రీవారికి జరిగే పంచామృతాభిషేకం ఉదయం 6.30 గంటల నుంచి 8.30 వరకు నిర్వహిస్తామన్నారు. అనంతరం నిజపాద దర్శనం, అర్చన, మంగళాశాసనాల తర్వాత ఉదయం 11 గంటల వరకు మాత్రమే దర్శనాలకు అనుమతిస్తామన్నారు. సాయంత్రం ఆలయాన్ని మూసివేస్తామన్నారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు ఆలయ సంప్రోక్షణ జరిపి 10 గంటల తర్వాత దర్శనాలకు అనుమతిస్తామన్నారు. భక్తులు ఈ మార్పును గమనించి ఆలయాన్ని సందర్శించాలని సూచించారు.

ముగ్గురు ఎంపీడీవోలకు పదోన్నతి

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవోలు)కు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులుగా పదోన్నతి లభించింది. పాయకరావుపేట ఎంపీడీవో ఎ.జయప్రకాశరావుకు పాడేరు డీడీవోగా, పద్మనాభం ఎంపీడీవో ఎం.విజయకుమార్‌కు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే డిప్యూటేషన్‌పై రుషికొండలో గిరిజన సంక్షేమ శాఖ కల్చరల్ ఇనిస్టిట్యూట్‌లో అసోసియేట్ ఆచార్యునిగా పనిచేస్తున్న జి.చంద్రకళకు పదోన్నతి ఇచ్చి అదే పదవిలో కొనసాగాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా డీడీవోలుగా పదోన్నతి పొందిన వారిలో గన్నవరం ఎంపీడీవోను అల్లూరి జిల్లా డ్వామా కార్యాలయంలో ఏపీడీగా, పామర్రు ఎంపీడీవో కె.జ్యోతిని ఏపీవోగా, పెద్దాపురం ఎంపీడీవో డి.శ్రీలలితను విశాఖ జిల్లా డ్వామా కార్యాలయంలో విజిలెన్స్ అధికారిగా నియమించారు.

పిన్న వయసులోనే అవాస్కులర్ నెక్రోసిస్

... 5వ పేజీ తరువాయి

తీరు పెరగడం వంటివి ఈ సమస్య తీవ్రత పెరగడానికి కారణమవుతున్నట్టు చెబుతున్నారు. ఆస్తమా, రుమటైడ్ ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మందులు వినియోగించిన వారిలోనే ఈ సమస్య కనిపిస్తున్నట్టు చెబుతున్నారు.

ఈ వయసు వారిలో ఎక్కువ..

గతంలో 50 ఏళ్లు దాటినవారు ఈ సమస్య బారినపడేవారు. ప్రస్తుతం యుక్త వయస్కులు అధికంగా కనిపిస్తున్నట్టు చెబుతున్నారు. ప్రతి పది కేసుల్లో ఆరు నుంచి ఏడు కేసులు 20 నుంచి 40 ఏళ్ల మధ్యవయస్కులు ఉంటున్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

అధిక సంఖ్యలో వస్తున్న కేసులు

ఏవీఎన్‌తో బాధపడుతూ ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు నెలకు ఒకటి, రెండు వస్తుండేవి. ఇప్పుడు ప్రతిరోజూ ఓపీలో ఒకటి, రెండు కేసులు చూస్తున్నాం. ఈ సమస్యను ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం తీసుకోవడం కీలకం. సమస్య గ్రేడ్ 1, 2లో ఉన్నప్పుడు వస్తే వారికి కోర్ డీ కంప్రెషన్, బోన్ మ్యారో యాస్పిరేషన్ కాన్సంట్రేషన్ అనే సర్జరీలు నిర్వహిస్తాం. బోన్ మ్యారో యాస్పిరేషన్ కాన్సంట్రేషన్ సర్జరీ బయట చేయించుకోవాలంటే చాలా ఖర్చవుతుంది. కేజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తున్నాం. గ్రేడ్ 3, 4లో వచ్చిన వారికి తీవ్రమైన ఇబ్బందులు ఉంటాయి. వారికి పరిస్థితిని బట్టి వైద్య సేవలు అందిస్తాం. శస్త్ర చికిత్సలు, వైద్య పద్ధతుల ద్వారా నిలిచిపోయిన రక్త ప్రసరణను మళ్లీ సరిచేసి కోలుకునేలా చేస్తాం.

-డాక్టర్ ఎం.చంద్రశేఖరంనాయుడు, ఆర్థో విభాగాధిపతి, కేజీహెచ్

బై..బై..గణేశా

... 5వ పేజీ తరువాయి

నిమజ్జనం చేశారు. గాజువాక లంకా మైదానంలో లక్ష చీరల వినాయకుడి అనుపు కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. లక్ష చీరలను భక్తులకు అక్కడే పంపిణీ చేస్తామని నిర్వాహకులు చెప్పగా పోలీసులు అంగీకరించలేదు. తోపులాటలు జరుగుతాయని, వాటిని వేరే చోట ఇంకెప్పుడైనా, లేదంటే ఆన్‌లైన్‌లో పంపిణీ చేసుకోవాలని సూచించారు.

15 నుంచి కార్పొరేటర్ల అధ్యయన యాత్ర

... 5వ పేజీ తరువాయి

పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారు. 17న జోధ్‌పూర్ నుంచి అజ్మీర్, పుష్కర్ వెళ్లి రాత్రికి తిరిగి జోధ్‌పూర్ చేరుకుంటారు. 18న జోధ్‌పూర్ కార్పొరేషన్ పరిధిలో అమలవుతున్న ప్రాజెక్టులను పరిశీలిస్తారు. 19న జైసల్మీర్ వెళ్లి అక్కడ పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారు. 20న జైసల్మీర్‌లోనే ఇతర సందర్శనీయ ప్రాంతాలకు వెళతారు. 21న జైసల్మీర్ నుంచి బికనీర్ మీదుగా ఢిల్లీ వెళతారు. 22న ఢిల్లీలో వివిధ ప్రాంతాలు సందర్శిస్తారు. 23న ఢిల్లీ నుంచి విమానంలో తిరిగి విశాఖ చేరుకుంటారు. ఇదిలావుంటే అధ్యయన యాత్రల పేరుతో గత నాలుగేళ్లు ఉత్తర భారతదేశంలో పలు నగరాలను సందర్శించిన కార్పొరేటర్లు ఏం అధ్యయనం చేశారు?, అక్కడ ఉత్తమ ప్రాజెక్టులుగా గుర్తించిన వాటిలో ఎన్నింటిని నగరానికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకున్నారు?...అనే ప్రశ్నిస్తే మాత్రం ఒక్క కార్పొరేటర్ కూడా నోరువిప్పరు.

జిల్లా కోర్టులో ఇ-సేవా కేంద్రం ప్రారంభం

మహారాణిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో ఇ-సేవా కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు ప్రారంభించారు. ఈ కోర్టు ప్రాజెక్టులలో భాగంగా విశాఖ జిల్లా కోర్టులో ఇ-సేవా కేంద్రం ఏర్పాటైంది. దీనిని శనివారం జస్టిస్ రావు రఘునందనరావు ప్రారంభించారు. న్యాయవ్యవస్థలో డిజిటల్ అంతరాయాన్ని తగ్గించి న్యాయం అందరికీ అందుబాటులో ఉండేలా చేయటమే ప్రధాన లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా న్యాయవాదులకు, కక్షిదారులకు, సాధారణ ప్రజలకు ఒకే వేదికపై అనేక డిజిటల్ సేవలు లభిస్తాయన్నారు. కేసు స్థితి, తదుపరి విచారణ తేదీ, ఇతర వివరాలు, విచారణలు నిర్వహించటం, అండ్రాయిడ్ ఐవోఎస్‌ల కోసం ఈ కోర్టుల మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయటం, సహాయం చేయటం, ఉచిత న్యాయసేవలు ఎలా పొందాలో ప్రజలకు మార్గనిర్దేశం చేయటం, న్యాయపరమైన ఆదేశాలు, తీర్పు సాఫ్ట్ కాపీలను అందుబాటులో ఉంచటం వంటి సేవలు లభిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, చల్లా గుణరాజన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ రఘునందనరావు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

జ్ఞానాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 41వ వార్డు పరిధిలో రూ.94.15 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సుబ్బలక్ష్మీనగర్‌లో దక్షిణ నియోజకవర్గ ఎమెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా కూడా ఇందులో పాల్గొన్నారు. రూ.74.3 లక్షలతో సుబ్బలక్ష్మీనగర్, దొండపర్తి జంక్షన్ పరిసర ప్రాంతాల్లో రూ.19.85 లక్షలతో జ్ఞానాపురం, బాబుకాలనీలో తారురోడ్లు, సిమెంటు రోడ్లు, సిమెంటు కాలువలు, సిమెంటు కల్వర్టులను నిర్మిస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమాలు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 90 శాతం వరకు అభివృద్ధి పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వార్డును మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్, కూటమి నాయకులు ఐతి మధుబాబు, శేఖర్, సంజీవరావు, బానోజీ, అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిలాఫలకాలను ఆవిష్కరించిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

పుష్పిత అజేయ అర్ధ సెంచరీ

- వైజాగ్ చీతాస్ గెలుపు
- విమెన్ టీ20 టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్ర విమెన్ లీగ్ టోర్నీలో భాగంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో వైజాగ్ చీతాస్ 77 పరుగుల తేడాతో తుంగభద్ర దివాస్‌పై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన వైజాగ్ చీతాస్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 169 పరుగులు చేసింది. శుభశ్రీ (24), స్నేహ దీప్తి (27), అయేషా సింగ్(21), కె.పుష్పిత అజేయ అర్ధ సెంచరీ (67 నాటౌట్), మహ్మద్ జెహ్రా మెహక్ (19) రాణించారు. దివాస్ బౌలర్ పూజితకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో తుంగభద్ర దివాస్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 92 పరుగులు చేసింది. హాసిని (26), కె.హంస (24 నాటౌట్), పూజిత (23 నాటౌట్) మినహా మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. వైజాగ్ చీతాస్‌లో నవ్య మూడు, తమన్న రెండు వికెట్లు తీశారు. అజేయ అర్ధ సెంచరీతో రాణించిన కె.పుష్పిత మ్యాచ్ ఆఫ్ ద ప్లెయిర్‌గా నిలిచింది.

వివిధ రంగాల ప్రముఖులకు ఘన సత్కారం



విజయవాడలో డా.బాబ్జీకి విద్యాసాహితీ సత్కారం చేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



పౌర గ్రంథాలయంలో డాక్టర్ నాగేశ్వరరావు సత్కార కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు



ఎన్‌జీజీవోస్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని రాధాకుమారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో స్వచ్ఛందంగా సేవలందించిన బహుభాషా సాహితీవేత్త, నగరానికి చెందిన డాక్టర్ బాబ్జీకి సాహితీ విద్యా సత్కారం లభించింది. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ రామమోహన గ్రంథాలయంలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నారు. విద్యా రంగంలో ఎనలేని సేవలందించిన డా.బాబ్జీని బహుభాషా సాహితీవేత్తగా గుర్తించి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ సుబ్బారావు, ఆచార్య కేవీయన్నారావు, జి.వి.పూర్ణచంద్ పాల్గొన్నారు. తనను సత్కరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని బాబ్జీ పేర్కొన్నారు. తన జీవితమంతా విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి నాగేశ్వరరావు

సీతంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నటుడిగా, గాయకుడిగా రాణించడమే కాకుండా ఉద్యోగరీత్యా వాణిజ్య పన్నుల విభాగంలో అత్యున్నత స్థాయి అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన ఏవీ నాగేశ్వరరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఆంధ్ర విశ్వకళా పరిషత్ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగలపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో స్వర సామ్రాట్ నాగేశ్వరరావు కల్చరల్ అండ్ సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ నాగేశ్వరరావుకు శనివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు, నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సినీ సంగీత విభావరి ఏర్పాటు చేశారు. సీటీవో శ్రీలక్ష్మి, యూనియన్ నాయకులు కన్నా సాహెబ్, విశ్రాంత డీసీటీవో పాత్రుడు, ఎ.కార్తీక్, కొణతాల రాజు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పి.రాజేంద్రప్రసాద్, వివిధ సాంస్కృతిక సంస్థల అధినేతలు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని (హెచ్‌ఎం) జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. విద్యార్థులకు విద్యను బోధిస్తున్న గురువులను ప్రధానోపాధ్యాయిని రాధాకుమారి శాలువాలతో సత్కరించారు. అలాగే హెచ్‌ఎంను కూడా ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఎంఎన్‌వీ విశ్వనాథం, కిశోర్, కిరణ్, అప్పారావు, గ్లోరీ, యూఎన్ రత్నం, భాగ్యలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతి పాఠశాలలో..

రవీంద్రభారతి పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేబీవీఎల్ శ్యామల పాల్గొన్నారు.

మిసెస్ ఏవీఎన్ కళాశాలలో..



ఏవీఎన్ కళాశాలలో సత్కారం పొందిన అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌తో విద్యార్థులు

మహారాణిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిసెస్ ఏవీఎన్ కాలేజీలో గురుపూజా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం కళాశాలలోని ప్రిన్సిపాల్ ఎం సింహాద్రినాయిడు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో భాగంగా విద్యార్థులంతా కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడును, ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజనీ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.కృష్ణకుమారి, లైబ్రేరియన్ స్వరాజ్యలక్ష్మి, తెలుగు టీచర్ డబ్బీరు గాయత్రి తదితరులను సత్కరించారు. అనంతరం అధ్యాపకులు విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి దేశ పురోభివృద్ధికి పాటుపడాలంటే తమ గురువులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ల నుంచి స్ఫూర్తి పొందండి



పూర్వ విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థినులు

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని శనివారం పూర్వ విద్యార్థినుల సమ్మేళనం జరిగింది. మహిళా కళాశాలలో విద్యను పూర్తి చేసి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థినులు ఒకేచోట కలుసుకుని అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ముఖ్య అతిథిగా హాజరై వారి అనుభవాలు తెలుసుకున్నారు. అలాగే ప్రస్తుతం వివిధ ఉద్యోగ హోదాలలో స్థిరపడి విద్యార్థినులకు మార్గదర్శకంగా నిలిచిన ఎం.సువర్ణ (డిప్యూటీ తహసీల్దారు), బి.మణిమాల (ఐసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్), కె.నాగమణి (ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని)లను ప్రత్యేకంగా అభినందించి కళాశాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి స్థిరపడిన వారందరినీ ప్రస్తుత విద్యార్థినులు స్ఫూర్తిగా తీసుకుని కళాశాల ఖ్యాతిని పెంచాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, బోటనీ అధ్యాపకురాలు టి.నివేదిత, కన్వీనర్ డాక్టర్ కె.గీతాంజలి, డాక్టర్ ఆర్.కిరణ్మయి, డి.అరుణ, పద్మ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టు పాత్ర కీలకం



సీనియర్ ఉపసంపాదకుడు దొడ్డి జనార్దనరావు దంపతులను సత్కరిస్తున్న వాసవి క్లబ్ వాల్తేర్ కపుల్స్ ప్రతినిధులు

సీతంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని వాసవి క్లబ్ వాల్తేర్ కపుల్స్ ప్రతినిధులు ఐఆర్‌కె ప్రసాద్, గ్రంథి సత్యవాణి కొనియాడారు. ద్వారకానగర్‌లోని వాసవి క్లబ్ వాల్తేర్ కపుల్స్ ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులను శనివారం ఘనంగా సత్కరించారు. విశాఖ నగరంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ జర్నలిస్టు బొల్లం కోటేశ్వరరావు, డెస్క్ జర్నలిస్టు దొడ్డి జనార్ధనరావు, సీనియర్ కెమెరామెన్ ఎం.దేవత్రినాథ్, ఫోటో జర్నలిస్టు ఆలపాటి శరత్‌కుమార్, సీనియర్ మహిళా జర్నలిస్టులు రాణి దేవెళ్ళ, ఎస్.అనురాధ, సీనియర్ జర్నలిస్టులు చిటిక రెడ్డి వెంకటరమణ, యర్రా నాగేశ్వరరావు, నమ్మి చంద్రమౌళి, కింతాడ మదన్‌లను ఘనంగా సత్కరించి జ్ఞాపికలతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా తులసి మొక్కలను అందచేశారు. నిరుపేద విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ వాల్తేర్ కపుల్స్ ప్రతినిధులు మద్దుల సునీల్ గుప్త, తవ్వ సంపత్, బొడ్డు రాజేష్ బాబు, గ్రంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చేతులు మారిన కాలనీ ఇళ్లు

... 5వ పేజీ తరువాయి

సదుపాయాలు కల్పించారు. పాఠశాల, సామాజిక భవనాలు నిర్మించారు. అయితే అప్పట్లో గాజువాకకు దూరంగా ఉండడంతో చాలాకాలం లబ్ధిదారులు కాలనీకి వెళ్లలేదు. కొద్దిమంది మాత్రమే తొలుత అక్కడ నివాసం ఏర్పాటుచేసుకోగా, తరువాత నెమ్మదిగా మరికొందరు వెళ్లారు. ఇంకా కొందరు రాకపోవడంతో దానిని అవకాశంగా తీసుకుని రౌడీమూకలు ఖాళీగా ఉన్న ఇళ్లను తప్పుడు పత్రాలు సృష్టించి తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి. కాలనీలో లబ్ధిదారులు ఉంటున్నారా? లేదా అనే దానిపై గతంలో హౌసింగ్ అధికారులు ఒకసారి సర్వే చేశారు. ఇళ్లలో నివాసాలు లేనివారిని గుర్తించి నోటీసులు ఇచ్చి కేటాయింపులు రద్దు చేశారు. కొందరు అప్పటికప్పుడు అధికారులను కలిసి విన్నవించుకోగా సమాచారం లేని మరికొందరు పట్టించుకోలేదు. ఇటువంటి ఇళ్లను ఇతరులకు కేటాయించినపుడు హౌసింగ్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందనే వాదన వినిపించింది. కాగా 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అగనంపూడి కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్లను తమకు కేటాయించాలని గాజువాకు చెందిన పేదలు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీలో తాజా పరిస్థితిపై విచారణ చేయాలని కోరిన వెంటనే కలెక్టర్ పూర్తిస్థాయిలో ప్రతి ఇంటికీ బృందాన్ని పంపి వాస్తవాలు సేకరించారు. మొత్తం 3,616 ఇళ్లలో 298 మంది లబ్ధిదారులు తమ ఇళ్లను ఇతరులకు విక్రయించేసి వెళ్లిపోగా 2012లో ఇళ్లు కేటాయించినా ఇంత వరకు గృహ ప్రవేశాలు చేయనివారు 494 మంది ఉన్నట్టు విచారణలో తేలింది. కాలనీలో 943 మంది నివాసం ఉండగా, 168 ఇళ్లలో ఇతరులు అద్దెకు ఉంటున్నారు. మరో నాలుగు ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు చనిపోయినట్టు గుర్తించారు. విచారణ సమయంలో 1,709 ఇళ్లకు తాళాలు వేసినట్టు గుర్తించారు. విచారణ బృందాలు వస్తున్న విషయం తెలుసుకున్న కొందరు బినామీలు, అనధికారికంగా ఆక్రమించిన వ్యక్తులు అప్రమత్తమై ఇళ్లకు తాళాలు వేసినట్టు అనుమానిస్తున్నారు. రౌడీమూకలు ముఠాగా ఏర్పడి పదుల సంఖ్యలో అనధికారింగా ఆక్రమించడం లేదా అద్దెకు ఇవ్వడం చేశారని కాలనీలో పలువురు చెబుతున్నారు. హౌసింగ్ అధికారులు విచారణ నివేదికను త్వరలో కలెక్టర్‌కు అందజేయనున్నారు. దీని ప్రకారం అనర్హులను ఏరివేసి ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

నగదుకు బదులు వస్తువులు

... 5వ పేజీ తరువాయి

రూ.125 చెల్లిస్తుండగా, ఇకపై రూ.200, బాలికలకు రూ.150 నుంచి రూ.250కు పెంచారు. ఈ మొత్తంతో విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించనున్నారు. అలాగే బాలుర హెయిర్ కటింగ్‌కు రూ.30 చెల్లిస్తుండగా, ఈ మొత్తాన్ని రూ.50కు పెంచారు.

ఈ వస్తువులు అందజేత..

కాస్మొటిక్ చార్జీల కింద నగదుకు బదులుగా వస్తువులను కొనుగోలు చేసి ఇవ్వనున్నారు. ఇందులో కొబ్బరినూనె, టూత్ పేస్ట్, టూత్ బ్రష్, పౌడర్ డబ్బా, షాంపూ, సబ్బు ఉంటాయి. అమ్మాయిలకు శానిటరీ నాప్‌కిన్లు అందించనున్నారు. రెండు నెలలకు ఒకసారి వీటిని అందించనున్నారు. దీనిపై సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావును వివరణ కోరగా ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని, దీనివల్ల విద్యార్థులకు మేలు చేకూరుతుందని వివరించారు.

నవంబరుకల్లా అనకాపల్లికి పోలవరం నీరు

... 5వ పేజీ తరువాయి

కలెక్టరేట్‌లో జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. అందులో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాల వివరాలను విలేకరుల సమావేశంలో మంత్రి వెల్లడించారు. విశాఖ నగరం, పారిశ్రామిక సంస్థలకు అవసరమైన నీరు పోలవరం నుంచి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పోలవరం నుంచి వచ్చే నీటిని నిల్వ చేయడానికి 4.5 టీఎంసీల సామర్థ్యంతో చెరువుల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు జీవీఎంసీ నుంచి నిధులు ఇచ్చేలా ఆదేశించామన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వేసవిలో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా జీవీఎంసీ చర్యలు తీసుకుంటుందన్నారు. నగరంలో నైరుతి రుతుపవనాల సీజన్‌కు ముందు సగటున ఎనిమిది మీటర్లు, ఆ తరువాత మూడు మీటర్లలోతు వరకూ భూగర్భ జలాలు ఉండేలా కార్యాచరణ అమలుకు నిర్ణయించామన్నారు.

పారిశుధ్య సమస్యపై పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుని నగరంలో కొత్తగా తాత్కాలిక విధానంలో పారిశుధ్య కార్మికులను నియమించాలని నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి తెలిపారు. వీధి దీపాల నిర్వహణ మెరుగుపరచాలని అధికారులకు ఆదేశించామన్నారు. టిడ్కో ఇళ్ల సమస్యపై అసెంబ్లీలో చర్చించాలని సమావేశం తీర్మానించిందన్నారు. నగరంలో పలు ప్రాజెక్టుల పురోగతికి అవరోధంగా ఉన్న సమస్యలపై చర్చించడానికి రైల్వే, పోర్టు, తూర్పు నౌకాదళం అధికారులు, జిల్లా అధికారులతో కమిటీ ఏర్పాటుచేశామన్నారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని నిర్ణయించామన్నారు. దీపం-2 పథకం కింద ఉచిత సిలిండర్ల సబ్సిడీ సొమ్ము జమకాని లబ్ధిదారులకు సాయం అందించేందుకు చర్యలు తీసుకునేలా ఆదేశించామన్నారు. జిల్లాలో ఉపాధి కల్పనకు ముందుకు వచ్చే సంస్థలకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలు గుర్తించి ఇవ్వనున్నామన్నారు. సచివాలయాల్లో ప్రింటర్ల కొరత తీర్చడానికి టెండర్లు ఆహ్వానిస్తామన్నారు. ప్రభుత్వ శాఖలపై కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులపై త్వరలో సమీక్షించనున్నట్టు మంత్రి తెలిపారు. కేజీహెచ్‌లో డయాలసిస్ యూనిట్లు పూర్తిగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని ఒక ప్రశ్నకు బదులుగా మంత్రి తెలిపారు. ప్రైవేటు అంబులెన్స్‌ల దందాపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిస్తానని మంత్రి తెలిపారు. గత సమీక్షా సమావేశంలో చర్చించిన అంశాలను పరిష్కరించామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్ రాజు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు పాల్గొన్నారు.

మహా అధ్వానం

... 5వ పేజీ తరువాయి

తలెత్తుతుందని పేర్కొన్నారు. అందుకు జీవీఎంసీ కమిషనర్ స్పందిస్తూ నగరంలో 250 మురుగు కాల్వలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. పోర్టు, రైల్వే రక్షణ శాఖ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు.

నగరంలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడంలేదని ఎమ్మెల్యేలు వెలగపూడి, విష్ణుకుమార్‌రాజులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాటిచెట్లపాలెం, ధర్మానగర్, కంచరపాలెం మెట్టు, కొండవాలు ప్రాంతాలు రాత్రి పూట అంధకారంలో ఉంటున్నాయని విష్ణుకుమార్‌రాజు ఆందోళన వ్యక్తంచేశారు. రాత్రి రెండు గంటలకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లే సమయంలో పెదజాలారిపేటలో హైమాస్ట్ లైట్లు వెలగక చీకటిగా ఉండడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని వెలగపూడి వివరించారు. 26, 43, 46, 47 వార్డుల్లో జీవీఎంసీలో గోస్టు వర్కర్లు ఉన్నారని విష్ణుకుమార్‌రాజు అధికారుల దృష్టికి తీసుకురాగా మంత్రి జోక్యం చేసుకుని విచారణ చేయాలని ఆదేశించారు.

కొండవాలు ప్రాంతాలతోపాటు పలుచోట్ల ప్రజలకు తాగునీరు సరిగ్గా అందడం లేదని ఎమ్మెల్యేలంతా ఆందోళన వ్యక్తంచేశారు. ఈ దశలో మంత్రి మాట్లాడుతూ నగర ప్రజల అవసరాలను అనుగుణంగా నీటి నిల్వలు పెంచుకునే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గణబాబు మాట్లాడుతూ మేహాద్రిగెడ్డ, గంభీరం రిజర్వాయర్‌లలో పూడిక తీయాలన్నారు. ముడసర్లోవలో పూడిక తీయడంతోపాటు సామర్థ్యం పెంచాలని వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. ఈ దశలో మంత్రి జోక్యం చేసుకుని తాటిపూడి రిజర్వాయర్ నుంచి ప్రస్తుతం వస్తున్న నీటికి అదనంగా మరికొంత నగరానికి తీసుకురావాలని అనడంతో అందుకు ప్రభుత్వ అనుమతి అవసరమని సంబంధిత అధికారులు తెలిపారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ పోలవరం నీటిని వినియోగించుకునేందుకు అదనంగా 4.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కోసం కొన్ని చెరువులు అభివృద్ధి చేస్తున్నామన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు డీసీసీబీ నుంచి రుణాలు మంజూరుచేయాలని ఎమ్మెల్యే గణబాబు కోరగా, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ రుణాల మంజూరుపై ఆప్కాబ్‌లో చర్చించాలని, ఇంకా అందుకు ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలన్నారు. జిల్లాలో స్వయంశక్తి సంఘాలకు తక్కువ వడ్డీకి డీసీసీబీ ద్వారా రుణాలు అందజేసేందుకు యూసీడీ, డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణ ప్రక్రియ మందకొడిగా సాగుతుందని ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు ఆందోళన వ్యక్తంచేశారు. దానిపై సచివాలయాల సిబ్బందికి అవగాహన లేదని, తహశీల్దార్ల ద్వారా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ వేపగుంట-పినగాడి రోడ్డుకు మోక్షం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. నగరానికి గ్రామీణ ప్రాంతాలకు కనెక్టివిటీ రోడ్లు అభివృద్ధి చేయాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాకలో భూముల క్రమబద్ధీకరణ జరిగిన స్థలాలకు టైటిల్ డీడ్ మారడం లేదన్నారు. స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపోను ఖాళీ చేయాల్సిందిగా ఉక్కు యాజమాన్యం నుంచి ఒత్తిడి తీసుకువస్తున్నందున కొత్తగా స్థలం కేటాయించాలని కోరగా, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు జోక్యం చేసుకుని ఉక్కు పరిధిలో డిపోను ఎందుకు తరలించాలని ప్రశ్నించారు.

అభివృద్ధి పరుగులు పెట్టాలి: మంత్రి

క్లీన్ సిటీ, స్మార్ట్ సిటీ అయిన మహా విశాఖ నగర అభివృద్ధిపై అధికార యంత్రాంగం ప్రధానంగా దృష్టిసారించాలని ఇన్‌చార్జి మంత్రి శ్రీవీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. నగరంలో అభివృద్ధి పరుగులు పెట్టాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అంశాల వారీగా సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అన్ని శాఖల నుంచి నాణ్యమైన సేవలు అందాలని, ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వారికి అందాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమయ్యయంతో ముందుకువెళ్లాలన్నారు. మేహాద్రిగెడ్డ, ముడసర్లోవ, గంభీరం రిజర్వాయర్ల నిర్వహణ మరింత మెరుగుపడాలన్నారు. కోర్టు కేసులపై ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయాలని కలెక్టర్‌కు సూచించారు. కొన్ని అంశాలపై స్పష్టంగా సమాధానాలు చెప్పని అధికారులపై మంత్రి అసహనం వ్యక్తంచేశారు. వచ్చే సమావేశానికి పక్కా సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఏపీ ఆయిల్ గ్రోవర్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్లు కేతన్‌గార్గ్, కేఎస్ విశ్వనాథన్, డీసీపీ మేరీ ప్రశాంతి, డీఆర్వో భవానీశంకర్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత మాథుర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు తెలుపుతున్న ఎం.గణపతి, 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కష్టపడే కార్యకర్తలకు టీడీపీలో గుర్తింపు ఉంటుందని 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు తెలుగు యువత అధ్యక్షుడిగా మానాపురం గణపతిని నియమించినందుకు నల్లూరు ఆధ్వర్యంలో శనివారం పలువురు కార్యాకర్తలు, నాయకులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మానాపురం గణపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ అవకాశాన్ని ఇచ్చిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు, నల్లూరు సూర్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి సైనికుడిలా శ్రమిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మొల్లిపెంటిరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి వేగుంట.శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో చురుగ్గా విద్యార్థులు

పెదగంట్యాడ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజ్ వికాస్ ట్రస్ట్, గాజువాక లయన్స్ క్లబ్ సహకారంతో లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాలులో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్స్ కేటగిరిలో 6,7,8 తరగతుల విద్యార్థులు, సీనియర్ కేటగిరిలో 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్విజ్ పోటీల్లో భారతీయ సంస్కృతి, చరిత్ర, రాజకీయం, రాజ్యాంగం, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఇతిహాసాలు, జనరల్‌నాలెడ్జి అంశాలపై క్విజ్ నిర్వహించారు. సమాజ్ వికాశ్ ట్రస్ట్ కన్వీనర్ ఎం.జగదీశ్ ప్రసాద్ క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. కార్యక్రమానికి జీవీఎంసీ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు మిగతా అంశాలపై కూడా దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు.

సొంత భవనాలు లేక అంగన్‌వాడీల అవస్థలు

» శిథిలస్థితిలో పాత అంగన్‌వాడీ భవనం » గ్రామంలో ఉన్న కళావేదికలలో కేంద్రాల నిర్వహణ » ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్న పిల్లలు


కళావేదిక గుమ్మంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



శిథిలస్థితిలో ఉన్న పాత అంగన్‌వాడీ భవనం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాలను కళావేదికలపై నిర్వహిస్తుండడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాతయ్యపాలెం ప్రధాన రహదారిలో 1984లో సుమారు ఐదు వందల గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలంలో రెండు భవనాలు నిర్మించారు. ఒకటి ప్రాథమిక పాఠశాల మరొకటి అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారు. కాలక్రమేణా ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 2010లో బంగారమ్మ ఆలయం వద్ద ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రం మాత్రం 2018 వరకు ఆ భవనంలోనే నిర్వహించి, తరువాత కాలనీ మధ్యలో ఉన్న కళావేదిక వద్దకు కేంద్రాన్ని మార్చారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లల సంఖ్య పెరగడంతో, ఈ కాలనీకి మూడు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో రెండు కేంద్రాలను పాత పంచాయతీ భవనం దగ్గర కళావేదికపై నిర్వహిస్తున్నారు. మరో కేంద్రాన్ని బంగారమ్మ గుడి వద్ద ఉన్న కళావేదికపై నిర్వహిస్తున్నారు. సుమారు 50 మంది పిల్లలతో ఈ మూడు కేంద్రాలు కళావేదికలపై సర్దుకుపోతున్నాయి. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో, వర్షం కురుస్తున్న సమయంలో కళావేదికపై ఉన్న గదుల్లోనే పిల్లలను ఉంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తమ పిల్లలను అంగన్‌వాడీలకు పంపేందుకు పలువురు తల్లిదండ్రులు నిరాకరించారని స్థానికులు తెలిపారు. దీనికి తోడు ఈ కళావేదిక పైనే స్థానిక వైద్య సిబ్బంది ఆరోగ్య శిబిరాలను, టీకా కేంద్రాలను నిర్వహిస్తుంటారు. ప్రధాన రహదారిలో శిథిలమైన పాత అంగన్‌వాడీ కేంద్రం ఆకతాయిలు మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు తీసుకుంటున్నారు. ఈ స్థలం వారికి అడ్డాగా మారింది. కాలనీకి సుమారు రూ.50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. వీటితో కొత్త అంగన్‌వాడీ భవనం, మహిళా సామాజిక భవనం వంటివి నిర్మించాలని కాలనీ నాయకులతో పాటు వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కానీ అది ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలం కబ్జాదారుల కంట పడక ముందే అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ప్రజలకు ఉపయోగపడే సామాజిక భవనాన్ని నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అట్టహాసంగా నిమజ్జనాలు

» వినాయక ఉత్సవాలు ప్రశాంతం

గాజువాక, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రులు ముగియడంతో శనివారం ఒక్కరోజే పారిశ్రామిక ప్రాంతంలో 70కి పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న విగ్రహాలను కొన్నింటిని అప్పికొండ సముద్ర తీరంలో, మరికొన్ని విగ్రహాలను లంకెలపాలెం సమీప కాలువల్లో, పెదగంట్యాడ ప్రాంత గెడ్డల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వినాయకుని ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

అన్నసమారాధనలు

పెందుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పాతూరు, యాతపేట, సాలిపేట, దొగ్గవానిపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీల్లో గల గణపతి మండపాల్లో శనివారం నిర్వహించిన అన్న సమారాధనల కార్యక్రమాలను మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు ప్రారంభించారు. అంతకుముందు గణపతి విగ్రహాలను దర్శించుకున్నారు.

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌కు డబ్బులు ఇవ్వొద్దు


మాట్లాడుతున్న ములగాడ మండల తహశీల్దార్ రమేశ్‌నాయుడు

మల్కాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండలంలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ నిమిత్తం ఏవరైనా డబ్బులు అడిగితే తనకు లేదా ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు)కు తెలియజేయాలని తహశీల్దార్ రమేశ్‌నాయుడు సూచించారు. శనివారం ములగాడ మండల కార్యాలయం వద్ద పలువురు లబ్ధిదారులతో ఆయన సమావేశమయ్యారు. కేవలం రూ.510 డీడీ లేదా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చలానా తీయాలన్నారు. అదనంగా డబ్బులు ఎవరైనా అడిగితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనేక మంది డబ్బులు వసూలుకు వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. డబ్బులు ఇచ్చినా, తీసుకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ ముగిసి రెండేళ్ల తరువాత ఇంటిని అమ్ముకోవచ్చు, రుణం పొందవచ్చని తహశీల్దార్ పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

కోటిలింగాల వినాయకుడి వివాదాలకు తెర..

» పోలీసుల ఒత్తిడితో ఉత్సవ విగ్రహం నిమజ్జనం » ప్రతిమల పంపిణీపై మీమాంస

మల్కాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం సమీపంలోని కొత్తనక్కావానిపాలెం ఏపీఐఐసీ మైదానంలో లంబోదర అసోసియేషన్ ఏర్పాటు చేసిన కోటి లింగాల వినాయకుడికి శనివారం అనుపోత్సవం నిర్వహించారు. కోటి లింగాల వినాయకుడిని భక్తుల వీక్షణ కోసం ఉంచి.. అక్కడే ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాన్ని అక్కడే నిమజ్జనం చేశారు. కోటి లింగాల వినాయకుడి ప్రతిమలను ఒక్కొక్కటిగా తీసి.. భక్తులకు పంచిపెట్టేందుకు నిర్వాహకులు వ్యూహం పన్నినా, పోలీసుల నుంచి అభ్యంతరాలు రావడంతో భక్తులకు పంచాలా..? లేదా..? అనే డైలమాలో నిర్వాహకులు ఉన్నారు. అయితే ఈ ప్రతిమను ఏం చేయాలో అనేదానిపై అర్చకులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని ఆలోచిస్తున్నారు. ఈ వినాయకుడ్ని ప్రతిష్ఠించినప్పటి నుంచి రోజుకో వివాదం కొనసాగుతూ వచ్చింది. మూడుసార్లు దర్శనాలు నిలిపివేసి తిరిగి ప్రారంభించారు. ఈసారి మాత్రం నిమజ్జనం చేయించాలని పోలీసులు పట్టుబట్టడంతో నిర్వాహకులు మారుమాట్లాడలేకపోయారు. కొద్దిమంది భక్తులు మాత్రమే లోపలకు వెళ్లారు. మిగిలినవారు గేటు బయటే ఉండిపోయారు. లోపలకు పోలీసులు ఎవరినీ అనుమతించలేదు. ఆదివారం చంద్రగ్రహణం నేపథ్యంలో అర్చకుల సూచన మేరకు ఉత్సవాలకు ముగింపు పలకడంతో వివాదాలకు తెరపడింది.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.14,55,243

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపును శనివారం కార్యాలయ ఆవరణలో చేపట్టినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. గడిచిన 12 రోజులకు రూ.14,55,243 నగదు రాగా, బంగారం 000-005-100 గ్రాములు, వెండి 000-101.100 గ్రాములు వచ్చాయన్నారు. యూఎస్‌ఏ డాలర్స్ 21, ఒమాన్ రీయల్స్ 4, బైసా 100, కెనడా 10 డాలర్స్, యూరో 10, ఇంగ్లాండ్ 10 పౌండ్స్ వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

నరవానిపాలెం పాఠశాలలో ఓపెన్ జిమ్‌కు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సేనాపతి వసంత

పెందుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నరవానిపాలెం ఉన్నత పాఠశాల మైదానంలో జీవీఎంసీ నిధులు రూ.15 లక్షలతో నూతనంగా ఏర్పాటుచేయనున్న ఓపెన్ జిమ్‌కు శనివారం కార్పొరేటర్ సేనాపతి వసంతశంకర్ శంకుస్థాపన చేశారు. ముఖ్య ప్రాంతాల్లో ప్రజారోగ్యం కోసం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అవగడ్డ అప్పలనాయుడు, అవగడ్డ అప్పారావు, కాగిత రమణ, ముత్యాల నాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు శ్రీ గణేశ్ నగర్ కాలనీలో శనివారం వినాయక మండపంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్నాహ్నం జరిగిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వార్డు కార్పొరేటర్ బొండా జగన్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాలలో అన్నదానం మిన్న అని అన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని దేవుడిని వేడుకుంటున్నామన్నారు. అలాగే 86వ వార్డులో పలు కాలనీల్లో రాజీవ్ నగర్, రాసాలమ్మ కాలనీల్లో శనివారం వినాయక మండపంలో జరిగిన ప్రత్యేక పూజల్లో వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, వేగుంట శ్రీనివాస్, పిన్నింటి ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నగరల కార్పొరేషన్ డైరెక్టర్‌గా సోమేష్



మల్కాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నగరల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మల్కాపురం ప్రాంతానికి చెందిన మజ్జి సోమేష్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. తెలుగుదేశం పార్టీకి ఆయన అందించిన సేవలు గుర్తించి ఈ పదవి కేటాయించింది. నిజాయతీగా నగరలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని సోమేష్ అన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే గణబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యమే మహా భాగ్యం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయని కణితి హైస్కూల్ హెచ్ఎం ఆర్.నరసింగరావు అన్నారు. మ్యాజిక్‌బస్ ఆధ్వర్యంలో కణితిలో జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోషకాలతో కూడిన వంటలను ప్రతి ఇంటి నుంచి తీసుకువచ్చి ప్రజలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి ఆరోగ్య రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, బరువు పెరుగుదలకు యోగా, వ్యాయామం, పౌష్టికాహారం అందజేయాలని నరసింగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కణితి పీడీ నారాయణ రావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 28, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 24, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 46, బంగాళ దుంపలు 20, అరటి కాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 70, బరబాటి 42, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

సంఘ నేతకు సన్మానం

తమల్కాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి రమణను సంస్థ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శనివారం ఘనంగా సన్మానించారు. సంఘం డైరెక్టర్ తిలక్ మాట్లాడారు. కె.శివకుమార్, డి.సత్తిబాబు, అప్పలకొండ, రమణ, గుణయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లు నడపాలని వినతి

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయదశమికి విశాఖ నుంచి విజయవాడ వెళ్లేందుకు, శ్రీకాకుళం నుంచి విశాఖ మీదుగా నర్సాపూర్ వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లను నడపాలని తూర్పు కోస్తా రైల్వే యూజర్సు కన్సల్టేటివ్ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ రైల్వే అధికారులకు శనివారం వినతి పత్రాలు పంపారు. దసరా నవరాత్రులను పురస్కరించుకుని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి లక్షలాది భవానీ భక్తులు విజయవాడకు వెళ్లనున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

నేడు వెంకటాద్రి ఆలయం మూసివేత

పెందుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఉదయం 11.30 గంటలకు పెందుర్తి వెంకటాద్రిపై గల శ్రీవారి ఆలయం మూసివేయనున్నట్లు ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. పెందుర్తిలోని ఉత్తరాంధ్ర శబరిమలై ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు మూసేసి 8న ఉదయం 8 గంటల నుంచి భక్తులకు అయ్యప్పస్వామి దర్శనం కల్పించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. చినముషిడివాడ సప్తగిరినగర్‌లో కొలువైన అలివేలు మంగాదేవికి ఆదివారం ఉదయం 9 గంటలకు పౌర్ణమి సేవలు నిర్వహిస్తారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ఎన్‌టీపీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను అదిష్ఠిపజేసి పుష్పాలతో సహస్ర నామార్చన, నక్షత్ర హారతి, కుంభ హారతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ పూజలలో దివ్య క్షేత్రం పాలకమండలి సభ్యులతో పాటు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం వద్దు

» ఇంటక్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులు జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కార్మికుల జీతాల చెల్లింపుల్లో యాజమాన్యం నిర్లక్ష్యం తగదని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఇబ్బందులను యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంస్థ ప్రగతి కోసం రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్న ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు సరికాదన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

అగనంపూడి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గుదే నారాయణమ్మ కుటుంబానికి రూ.30వేలు, నిత్యావసర సరకులను పెదమడక మార్కండేయ సేవాసంఘం శనివారం అందించింది. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ పప్పు రాజారావు ఈ సరకులను అందించారు. సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నో బ్యాగ్ డే


మొక్కలను సంరక్షిస్తున్న విద్యార్థినులు

గోపాలపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెల మొదటి శనివారం జరిగే సృజన-శనివారం సందడి (నో స్కూల్ బ్యాగ్ డే) కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను మెరుగుపరచడానికి ప్రతి నెలా మొదటి, మూడో శనివారాల్లో పాఠశాలల్లో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట పాటలతో పాటు, చిత్రలేఖనం, నృత్యం, పజిల్స్ నింపడం వంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటడం, నాటిన మొక్కల సంరక్షణ చేపట్టారు.











సరికొత్త టెక్నాలజీ, మార్పులపై అవగాహన అవసరం

» హెచ్‌పీసీఎల్ హెచ్‌ఆర్ డైరెక్టర్ కేఎస్ శెట్టి

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా అందుబాటులోకి వస్తున్న సరికొత్త టెక్నాలజీ, ఆయా రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవడంతోపాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవడం అత్యంత కీలకమని హెచ్‌పీసీఎల్ హెచ్‌ఆర్ డైరెక్టర్ కేఎస్ శెట్టి అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐపీఈ) ఆధ్వర్యంలో హోటల్ ఫోర్ పాయింట్‌లో ఫ్యూచర్ రెడీ వర్క్‌ఫోర్స్, బ్రిడ్జింగ్ టాలెంట్, టెక్నాలజీ అండ్ ఇండస్ట్రీ ఎక్స్‌పెక్టేషన్స్ ఇన్ ఎనర్జీ అనే అంశంపై శనివారం హెచ్‌ఆర్ కాంక్లేవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆటోమేషన్, డిజిటల్ సిస్టమ్ ఆధారంగా ఎనర్జీ రంగంలో జరుగుతున్న మార్పులను వివరించారు. ఆయా మార్పులకు నాయకత్వం వహించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. అనుసరించేందుకే పరిమితం కాకూడదని, లీడ్ చేయడం ద్వారా శక్తి, సామర్థ్యాలను తెలియజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐపీఈ బోర్డు ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ వీకే బాణిక్ మాట్లాడుతూ 2070 నాటికి కాలుష్యాన్ని పూర్తిగా తగ్గించే దిశగా ముందుకు సాగాలని, అందుకు అనుగుణమైన లక్ష్యాలను అమలు చేయాలన్నారు. వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ పెట్రో వర్సిటీ కేవలం గ్రాడ్యుయేట్లను తయారు చేయడానికే పరిమితం కావడం లేదని, ఇన్నోవేషన్స్ ద్వారా దేశం ఎనర్జీ ట్రాన్స్‌మిషన్‌లో కీలక పాత్ర పోషించేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో హ్యుండయ్ మోటార్ హెడ్ పీపుల్ స్ట్రాటజీ హెచ్‌ఆర్ డాక్టర్ నత్వర్ కేడర్‌తోపాటు వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు, ఐపీఈ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేఎస్ శెట్టి, తదితరులు

అర్ధరాత్రి వేళ రైల్వే భద్రతా నిర్మాణ పనులు



పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని పెందుర్తి-సింహాచలం విభాగంలో శుక్రవారం అర్ధరాత్రి బ్యాలస్ట్ క్లీనింగ్ మిషన్ భద్రతా నిర్మాణ పనులు చేపట్టారు. రైల్వే ట్రాక్ కింద ఉండే బెడ్‌ను స్క్రీనింగ్ చేయడం, బ్యాలస్ట్‌లను తొలగించి కింద ఉన్న మలినాలను శుభ్రం చేశారు. అవసరమైన బ్యాలస్టులను అమర్చి తిరిగి దానిని పునరుద్ధరించడంతోపాటు కింద డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచే బ్యాలస్ట్ క్లీనింగ్ మిషన్ పనులు అర్ధరాత్రి సమయంలో పూర్తి చేశారు. ఈ పనులను డీఆర్‌ఎం లలిత్ బొహ్రా పర్యవేక్షించి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా రైళ్ల రాకపోకలు తక్కువగా ఉన్న సమయాలను నిర్ధారించుకుని పనులు పూర్తి చేయించారు.

క్రైం... crime news

స్టీల్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులోని కోక్ ఓవెన్ విభాగంలో శనివారం ప్రమాదవశాత్తు ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కోక్ ఓవెన్ విభాగంలో పెదగంట్యాడ సమీపం నడుపూరు ప్రాంతానికి చెందిన సీహెచ్ అప్పలనాయుడు (52) కాంట్రాక్టు కార్మికుడుగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం విధుల్లో భాగంగా ఆయన సుమారు 30 అడుగుల ఎత్తులో పనిచేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న స్టీల్ ప్లాంట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

మల్కాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న రవికుమార్ (45) శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జార్ఖండ్‌కు చెందిన రవికుమార్ క్రాంతినగర్‌లోని ఓ ఇంట్లో ఒక్కరే ఉంటూ హెచ్‌పీసీఎల్‌లో పనిచేస్తున్నారు. అయితే ఏం జరిగిందో గానీ లుంగీతో ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రవికుమార్ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కిటికీలోనుంచి ఇంటి యజమాని చూస్తే ఉరి వేసుకుని కనిపించడంతో మల్కాపురం పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి తలుపులు తెరిచి చూసేసరికే ప్రాణాలు కోల్పోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారత సైన్యంలో ఉద్యోగం వేయిస్తానని మోసం

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత సైన్యంలో ఫైర్‌మెన్ ఉద్యోగం వేయిస్తానంటూ ఓ వ్యక్తి మోసం చేయడంతో సదరు వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఖాదర్ బాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివాజీపాలెంలో ఉంటున్న కె.చిట్టిబాబు తన స్నేహితురాలు వెన్నలరాణి ద్వారా 2023 ఫిబ్రవరిలో పరిచయం అయిన ఎం.రామారావు అనే వ్యక్తి సీఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగం చేస్తున్నట్టు చెప్పుకున్నాడు. ఉద్యోగం వేయిస్తానని ఇందుకు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపాడు. అడ్వాన్స్‌గా రూ.70 వేలు తీసుకున్నాడు. తర్వాత ఉద్యోగం వేయించలేకపోవడంతో సొమ్ము తిరిగి ఇవ్వమని చిట్టిబాబు ఒత్తిడి చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో 2023, డిసెంబరులో రూ.పది వేలు చెల్లించి, కొద్ది రోజుల్లో మిగిలిన మొత్తాన్ని ఇస్తానని రాతపూర్వకంగా ప్రామిసరి లేఖ ఇచ్చాడు. ఇప్పటికీ చెల్లించకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విమానాశ్రయంలో ఉద్యోగం వేయిస్తానని..

విమానాశ్రయంలో ఉద్యోగం వేయిస్తానంటూ మోసం చేసిన వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇసుకతోట రామాలయం వీధిలో ఉంటున్న రాళ్లపాటి వెంకటరమణకు కొద్ది రోజుల క్రితం నాని అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తనను తాను విమానాశ్రయంలో కాంట్రాక్టు జనరల్ మేనేజరుగా చెప్పుకున్నాడు. వెంకటరమణకు కూడా కాంట్రాక్టు ఉద్యోగం వేయిస్తానని నమ్మించి రూ.23 వేలు వసూలు చేశాడు. తర్వాత ఫోన్‌కు స్పందించడం మానేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ రామ్‌శంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అనంత పద్మనాభుని జయంత్యుత్సవం

పద్మనాభం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో గిరిపై ఉన్న అనంత పద్మనాభుని జయంత్యుత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈవో నానాజీబాబు ఆధ్వర్యంలో ముందుగా అనంతుని ఉత్సవ విగ్రహాలను కుంతీ మాధవస్వామి ఆలయంనుంచి ఊరేగింపుగా గిరిపైకి తీసుకువచ్చారు. అనంతరం మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం నిర్వహించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులు గిరి మెట్ల మార్గంలో ప్రథమ పావంచాల వద్ద పూజలు చేసి, మెట్ల మార్గం వెంబడి పసుపు,కుంకుమ బొట్లు పెట్టుకుని గిరిని అధిరోహించారు. ఘాట్‌రోడ్డు అందుబాటులోకి రావడంతో కొందరు వాహనాలపై తరలివచ్చారు. తరువాత అర్చకుడు పి.సీతారామాంజనేయస్వామి ఆధ్వర్యంలో కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలోని వేదికపై ఉభయ దేవేరులతో పాటు అనంతుని ఉత్సవ విగ్రహాలను ఉంచి సామూహిక వ్రతాలు జరిపారు. కార్యక్రమంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఎంపీపీ రాంబాబు, భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జి.ఎర్నాయుడు, ఏపీ నాగవంశం కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు అప్పలకొండమ్మ, అప్పలనాయుడు దంపతులు, ఎంపీడీఓ విజయకుమార్, సర్పంచ్ పాప, పద్దు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు, తదితరులు పాల్గొన్నారు.



గిరిపై ఉన్న అనంతుని మూలవిరాట్టుకు అభిషేకం చేస్తున్న అర్చకులు

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 'ఇగ్నో'కు మొదటి స్థానం

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)కు నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్-2025 సంవత్సరానికి దూరవిద్యా విశ్వవిద్యాలయాల విభాగంలో మొదటి స్థానం లభించింది. భారత దేశంలో సార్వత్రిక దూరవిద్య, ఆన్‌లైన్ విద్యలో మార్గదర్శిగా సంస్థ పాత్ర ప్రాధాన్యతను ఈ అవార్డుతో మరోసారి చాటిచెప్పిందని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సీనియర్ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలో భారత విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల వేడుకలో ఇగ్నో కులపతి ఉమా కంజీలాల్, విద్యా శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా మొదటి ర్యాంకు పురస్కారాన్ని, జ్ఞాపికను అందుకున్నారని ధర్మారావు తెలిపారు.



కేంద్ర విద్యా శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న ఇగ్నో కులపతి ఉమా కంజీలాల్



నూడిల్స్ తింటున్న యువతులు, పక్కన స్టాల్స్ వద్ద బారులుతీరిన సందర్శకులు

ఫుడ్ ఫెస్టివల్‌కు విశేష స్పందన

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక ఏర్పాటు చేసిన వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ సూపర్ హిట్ అయింది. దీనిని శుక్రవారం ప్రారంభించగా తొలి రోజే 20 వేల మంది వరకు వచ్చారని అంచనా. రెండో రోజు శనివారం అంతకుమించి సందర్శించారు. ఇక్కడ వివిధ స్టార్ హోటళ్లతో పాటు రెస్టారెంట్లు, ఫేమస్ సంస్థలు అందించే ఆహారాన్ని ఆరగించేందుకు యువత చాలా ఆసక్తిగా వస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన నీలోఫర్ కేఫ్ ఇక్కడ టీ,బన్‌ల స్టాల్ ఏర్పాటు చేసింది. ఇక్కడ యువత మస్కాన్ బన్, టీ కోసం క్యూ కట్టి మరీ కొనుక్కున్నారు. అలాగే బిరియానీ, చికెన్ కబాబ్స్ వంటి వాటిని తినడానికి టేబుల్ దొరక్క చాలామంది నిల్చొనే తింటున్నారు. పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.కాగా ఈ ఫెస్టివల్ ఆదివారంతో ముగియనున్నది.



థింసా నృత్యాన్ని ప్రదర్శిస్తున్న యువతులు



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పి.గణబాబు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ తదితరులు

రూ.12.5 కోట్లతో అండర్ పాస్‌వే నిర్మాణానికి శంకుస్థాపన

విశాఖపట్నం/వేపగుంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం సమీపాన కాకానినగర్, నేవల్ ఆర్మమెంట్ డిపో వద్ద రూ.12.5 కోట్ల అంచనా వ్యయంతో వీఎంఆర్‌డీఏ నిర్మించనున్న అండర్ పాస్‌వే నిర్మాణానికి ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, కమిషనర్ విశ్వనాథన్‌లు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ రెండు ప్రాంతాలకు అండర్ పాస్‌వే అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సిగ్నల్‌తో పని లేకుండా రాకపోకలు సాగించే సౌకర్యం సమకూరుతుందన్నారు. దీనికి తక్షణమే నిధులు మంజూరు చేయించిన వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రమాణాలకు అనుగుణంగా ప్రతిపాదిత మెట్రో రైలు ప్రాజెక్ట్ అలైన్‌మెంట్‌కులోబడి అండర్ పాస్‌వే పనులు చేపట్టడం జరుతుగుందని విశ్వనాథన్ పేర్కొన్నారు. దీనిని ఆరు నుంచి తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. నగరంలో పలు కంపెనీలు, భోగాపురం ఎయిర్‌పోర్టు త్వరలో ప్రారంభం కానున్నందున మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉండడంతో రద్దీ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయనున్నామన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ వినయకుమార్, ఎస్ఈ మధుసూదనరావు, జడ్సీ హైమావతి, కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, ముర్రు వాణి, తదితరులు పాల్గొన్నారు.

వెళ్లిరా.. వినాయకా!



గణేశుని విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేసేందుకు తీసుకువెళ్తున్న గజ ఈతగాళ్లు

సాగర తీరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను నిర్వాహకులు ఊరేగింపుగా తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. నగరంలో పలుచోట్ల ప్రతిష్ఠించిన గణనాథుని ప్రతిమలతో వచ్చిన నిర్వాహకులు, ప్రజలతో తీరంలో సందడి వాతావరణం నెలకొంది. సముద్రంలోకి నిర్వాహకులు ఎవరూ వెళ్లకుండా గజ ఈతగాళ్ల ద్వారా గణేశుని విగ్రహాలను నిమజ్జనం చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. భారీ విగ్రహాలను క్రేన్ల సాయంతో సాగరంలో నిమజ్జనం చేశారు.



గణనాథుల విగ్రహాలతో తీరానికి ఊరేగింపుగా వచ్చిన నిర్వాహకులు, విగ్రహంతో గజ ఈతగాడు